భార్య, ప్రియుడిని కడతేర్చి..



గొల్ల బాబు లక్ష్మీ పైతమ్మ గణేశ్ కుమార్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : హోరున వర్షం కురిసే ఆ రాత్రి.. ఆ ఇద్దరినీ మంచంపై అలా చూసేసరికి బాబు రక్తం ఉడికిపోయినట్లుంది. ఆ కోపంతోనే కన్నెర్ర చేశాడు. బెంగళూరు వీధుల్లో వాననీరు పారుతుంటే..ఆ గదిలో నెత్తురు పొంగేలా చేశాడు. ఇన్నాళ్లూ ఎంతో ఇష్టంగా చూసుకున్న భార్య కోలు లక్ష్మీ పైతమ్మ (40) మరో యువకుడు గణేశ్‌కుమార్ (20)తో పడక పంచుకోవడం సహించలేకపోయాడు. బుధవారం అర్ధరాత్రి ఆ ఇద్దరూ సరస సల్లాపాల్లో ఉండడాన్ని చూసిన భర్త కోలు గొల్లబాబు (45) చేతికి అందిన కొట్టెతో ఇద్దరిపై ఒక్కసారిగా దాడి చేశాడు. ఆ ఇద్దరినీ కసితీరా కొట్టి కడతేర్చాక.. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బెంగళూరు పోలీస్ అధికారులు వెల్లడించారు. వారు ఏ ప్రాంతం వారనే పూర్తి సమాచారం ఇంకా అందకపోయినా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారని ధ్రువీకరించారు. వారంతా ఒకే ప్రాంతం వాసులుగా అంచనా వేస్తున్నారు. కొన్నేళ్లుగా బెంగళూరు నగరంలో భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తూ ఉపాధి కల్పించుకున్నారు. కోణనకుంటె సోమేశ్వర లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఒక భవంతిలో ఆ ముగ్గురూ ఉండేవారని, అక్కడే పనికి కుదిరారని గుర్తించారు. ఆ ఇద్దరికీ సంబంధం ఉందని మొదటి నుంచి అనుమానిస్తూ వచ్చిన గొల్లబాబు.. పథకం ప్రకారమే బుధవారం అర్ధరాత్రి తరువాత నివాస ప్రాంతానికి చేరుకుని, కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు అధికారులు అంచనాకు వచ్చారు. వారిని హత్య చేశాక.. తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడని నగర డీసీపీ లోకేశ్ జగలాసర్ వివరించారు. వారిద్దరినీ హత్య చేసిన తర్వాత.. తన మరదలికి ఫోన్ చేసి సమాచారం అందించి బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. కోణనకుంటె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



కిలారి జోగయ్య, డాక్టర్ రత్నమ్మ, రాజశేఖర్ తళవార, కె.ఎస్.మృత్యుంజయ, రత్నమ్మ బి.సూగిలకు వాల్మీకి పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు

రామరాజ్య ప్రదాత.. వాల్మీకి!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల (ఎస్‌టీ) విద్యార్థి వసతి గృహాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, రాయచూరు విశ్వవిద్యాలయానికి మహర్షి వాల్మీకి పేరు పెడతామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం బెంగళూరు విధానసౌధలోని బ్యాంక్వెట్ హాల్‌లో ఎస్‌టీ వర్గాల సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి రెవెన్యూ ఫిర్కాలో గిరిజన విద్యార్థి వసతి గృహాలను ఏర్పాటు చేస్తామన్నారు. కాళిదాస, కురుబలతో పాటు మహాభారతాన్ని రాసిన వ్యాసుడు బడుగువర్గాలకు చెందిన వారని, రామాయణం రాసిన వాల్మీకి పీడిత వర్గాలకు ప్రతినిధిగా వివరించారు. అప్పటికే వీరంతా సంస్కృతంలో మహాగ్రంథాలను రాశారని శ్లాఘించారు. బడుగులు చదువుకోకుండా నిషేధించారని- ఇలాంటి సమయంలో వాల్మీకి సంస్కృతం నేర్చుకుని రామాయణం రాశారని, సమానత బోధించారని ప్రస్తుతించారు. రామరాజ్యమంటే సంపద అన్నివర్గాలకూ చెందాలని, సమానహక్కులు దక్కాలని ప్రతిపాదించారని గుర్తు చేశారు. శ్రీరామచంద్రుడి కుమారులు లవకుశలకు ఆశ్రయం కల్పించి తన ఆశ్రమంలో విద్యను బోధించారని గుర్తుచేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా.. వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్‌టీ వర్గాలకు ఉప ప్రణాళిక పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కమలనాథులు కేవలం మాటలతోనే సమానత సాధించలేరన్నారు. ఆర్థిక, సామాజిక రంగాల్లో మా ప్రభుత్వం సమానత కోసం శ్రమిస్తుందన్నారు. అసమానతలు నిర్మూలించకుండా సమానత సాధించలేరన్నారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఐదు గ్యారంటీ పథకాలు అమలులోకి తేస్తే విపక్షాలు సహించడం లేదన్నారు. భాజపాకి ప్రజలు గుణపాఠం చెప్పితీరాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వాల్మీకి పురస్కారాలను కిలారి జోగయ్య, డాక్టర్ రత్నమ్మ, ఎస్.రాజశేఖర్ తళవార, కె.ఎస్. మృత్యుంజయ, రత్నమ్మ సూగిలకు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి మఠాధిపతి ప్రసన్నానందపురి స్వామి, మంత్రులు సతీశ్ జార్ఖిహోళ్లి, కె.ఎన్.రాజణ్ణ, హెచ్.కె.పాటిల్, మాజీ ఎంపీ వి.ఎస్.ఉగ్రప్ప, శాసనసభ్యులు బసనగౌడ దద్దల్, డాక్టర్ అజయ్‌కుమార్‌సింగ్, అశోక్‌పట్టణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నపట్టణలో మిత్రభేదం

ఈనాడు, బెంగళూరు : జనతాదళ్(ఎస్) ఏ ఎన్నికల్లోనైనా సాధించే స్థానాలు అరకొరనే. అదే సమయంలో.. రాష్ట్ర రాజకీయాలను తన వైపు తిప్పుకోవటంలో ఈ పార్టీ పోరాటం అప్రతిహతం. అధికారంలో ఉన్నా.. లేకున్నా రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ నేతల వరకు జేడీఎస్ పార్టీ ప్రభావం చూపుతూనే ఉంటుంది. 2023 విధానసభ ఎన్నికలు, ఆ తర్వాత నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్ తన ప్రాధాన్యం ఏపాటిదో భాజపాకు తెలియజెప్పింది. సరిగ్గా అదే వ్యూహాన్ని రానున్న ఉప ఎన్నికల్లోనూ పన్నుతోంది. వచ్చే నెల 13న నిర్వహించే మూడు విధానసభ క్షేత్రాల ఎన్నికల్లో రెండు క్షేత్రాల్లో జేడీఎస్ పాత్ర అంతంత మాత్రమే. అసలు ఆ రెండు క్షేత్రాల్లో జేడీఎస్ అభ్యర్థి బరిలో దిగేదీ అనుమానమే. మిగిలిన ఒక క్షేత్రాన్ని భాజపాకు విడిచిపెట్టేందుకు ససేమిరా అంటోంది. పట్టువీడని జేడీఎస్ తత్వమే రాష్ట్ర భాజపా నేతలను కంటికి కునుకు లేకుండా చేస్తోంది.

విజయం ఎవరికో?

మధ్య కర్ణాటకలోని శిగ్గావ్, కల్యాణ కర్ణాటకలోని సండూరులో జనతాదళ్‌కు అంతగా పట్టులేదు. ఆ రెండు చోట్లా పోటీ జాతీయ పార్టీలైన భాజపా, కాంగ్రెస్ మధ్యనే. అక్కడ పోటీ చేసే భాజపా అభ్యర్థి గెలుపునకు జేడీఎస్ శ్రేణులు అనివార్యంగా సహకరించాల్సిందే. ఇక పాత మైసూరు, అందులోనూ కేంద్ర మంత్రి కుమారస్వామి వరుసగా రెండు సార్లు గెలిచిన చెన్నపట్టణలో భాజపా కంటే జేడీఎస్ ప్రభావమే అధికం. 2023 విధానసభ ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీ చేసిన జేడీఎస్ పార్టీ నేత కుమారస్వామి- ప్రధాన ప్రత్యర్థి భాజపా నేత సి.పి.యోగేశ్వర్‌ను 15,915 ఓట్లతో ఓడించారు. ఆ



జేపీ నడ్డాను కలిసి.. చర్చిస్తున్న ఆర్.అశోక్, సి.పి.యోగేశ్వర్ తదితరులు

ఆ ఒక్క సీటు కోసం నువ్వా.. నేనా!



ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాలే మారిపోయాయి. లోక్‌సభ ఎన్నికల కోసం జేడీఎస్ ఎన్‌డీఏలో భాగస్వామిగా మారటంతో ఉప ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య సంకటం మొదలైంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో బెంగళూరు గ్రామీణ పార్లమెంట్ నియోజకవర్గంలో భాజపా గుర్తుతో ఎన్‌డీఏ అభ్యర్థి డాక్టర్ సి.ఎన్.మంజునాథ్ పోటీ చేయగా.. అక్కడి భాజపా, జేడీఎస్ కార్యకర్తలంతా ఆయన గెలుపునకు తీవ్రంగా కృషి చేశారు. ఓ వైపు అత్యంత ప్రభావవంతమైన కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్‌తో పోటీ చేసి రెండు లక్షలకు పైగా మెజార్టీతో గెలిచిన మంజునాథ్ చరిత్ర సృష్టించారు. రాష్ట్రంలోని ఏ లోక్‌సభ క్షేత్రంలోనూ భాజపా, జేడీఎస్ ఇంత సమన్వయంతో పని చేయలేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. ఆ సమన్వయం ఉప ఎన్నికల కోసం కుదరనట్లే కనిపిస్తోంది.



బిడదిలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కుమారస్వామి

దళం వ్యూహమిదే

ఎన్‌డీఏ పొత్తులో భాగంగా ప్రతి ఎన్నికల్లోనూ కనీసం ఒక సీటైనా జేడీఎస్‌కు ఇవ్వాలి. ఈ ప్రకారం మూడు స్థానాల్లో ఒకటైన చెన్నపట్టణను మాకు వదిలేయాలని జేడీఎస్ పట్టుదలతో ఉంది. మిగిలిన రెండు చోట్లా భాజపా విజయానికి మా పార్టీ శ్రేణులు పని చేస్తాయని సూచించింది. చెన్నపట్టణలోనూ భాజపా సహకరించాలని జేడీఎస్ తాజాగా భాజపా అధిష్ఠానానికి మనవి చేసింది. ఈ టికెట్‌పై నిర్ణయాధికారాన్ని భాజపా అధిష్ఠానం తనకే వదిలేసిందని కుమారస్వామి గురువారం బిడది వద్ద స్పష్టం చేశారు. ఈ ప్రాంత ఎంపీనైన నాకు ఆ అధికారం ఉంటుందని రాష్ట్ర భాజపా నేతల యత్నాలకు గండికొట్టే ప్రయత్నం చేశారు. తన కుమారుడు నిఖిల్‌ను బరిలో దింపి తొలి విజయాన్ని అందించాలన్న పట్టుదలతో ఉన్న కుమారస్వామి పార్టీ కీలక నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్‌డీఏ మిత్రులకు సంకటాన్ని కల్గిస్తున్నారు.

కమలం.. పంతం

మిగిలిన రెండు క్షేత్రాల కంటే చెన్నపట్టణమే ఉప ఎన్నికల్లో ఉత్కంఠ రేపే స్థానంగా మారింది. ఈ క్షేత్రాన్ని జేడీఎస్‌కు ఇచ్చేందుకు భాజపా రాష్ట్ర నేతలు ఏమాత్రం ఇష్టంగా లేరు. ఇప్పుడిప్పుడే పాత మైసూరులో ప్రభావం చూపుతున్న భాజపాకు చెన్నపట్టణలో గెలవటం ఎంతో అవసరం. బెంగళూరు గ్రామీణలో సి.ఎన్.మంజునాథ్ భాజపా గుర్తుతో గెలిచినా ఆయన జేడీఎస్ పెద్ద దేవేగౌడ కుటుంబ సభ్యుడిగానే పరిగణిస్తారు. మండ్యలో కుమారస్వామే గెలిచారు. కోలారు ఎన్‌డీఏ మైత్రి సూత్రం ప్రకారం జేడీఎస్‌కు ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్ కోసం ఇంత చేస్తే ఈసారి మాకు వారి నుంచి సహకారం అవసరమని భాజపా పట్టుపడుతోంది. చెన్నపట్టణను భాజపాకు వదలి వేయటం వల్ల జేడీఎస్‌కు పెద్దగా నష్టం చేకూరే ప్రమాదం లేదని రాష్ట్ర నేతలు అధిష్ఠానానికి ప్రతిపాదించారు. జేడీఎస్‌కు చెన్నపట్టణ విడిచిపెడితే పాత మైసూరులో భాజపాకు గట్టిదెబ్బ తగులుతుందని హెచ్చరించారు. ఇక్కడ పార్టీలకు అతీతంగా గెలిచే సత్తా కలిగిన సి.పి.యోగేశ్వర్ (ఇప్పటికే నాలుగు సార్లు గెలుపొందారు)కు అవకాశం ఇస్తే మరోసారి గెలవగలరని అంచనా వేస్తున్నారు. జేడీఎస్‌కు సీటిస్తే కాంగ్రెస్ నుంచి గట్టిపోటీ ఎదురై ఓడే ప్రమాదం ఉందని విపక్ష నేత ఆర్.అశోక్, భాజపా రాష్ట్రాధ్యక్షుడు బి.వై.విజయేంద్ర అధిష్ఠానానికి నివేదిక ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తాను ఎంపీగా ఉండి కూడా జేడీఎస్‌కు అవకాశం ఇచ్చినట్లే చెన్నపట్టణను భాజపాకు వదిలేయాలని మాజీ ఎంపీ మునిస్వామి ఇదివరకే కుమారస్వామికి మనవి చేశారు.

మహిళా కాంగ్రెస్‌కు సౌమ్యా సారథ్యం



మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సౌమ్యారెడ్డి బాధ్యతలు చేపట్టిన వేళ పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరుల అభినందనలు..

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సౌమ్యారెడ్డి బాధ్యతలు చేపట్టినవేళ.. కాంగ్రెస్ నేతల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. కేంద్రంపై నేతలంతా నిప్పుల వర్షం కురిపిస్తూ.. శపథాలు చేయడం ప్రస్తావనార్హం. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం పనిగట్టుకుని విపక్ష నేతలను వెన్నాడుతోందని, వేధింపులకు గురిచేసేందుకు ఐటీ, ఈడీ, సీబీఐ తదితర సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధ్వజమెత్తారు. ఇవన్నీ ఎదుర్కోలేక భాజపాలో చేరిన వారంతా సచ్చరితులన్నట్లు ముద్ర వేస్తోందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ధ్వజమెత్తారు. కేంద్రంలో భాజపాకు మద్దతు ఇస్తున్న వివిధ పార్టీల నేతలపై ఉన్న కేసులను ఈడీ ఉపసంహరించుకున్నట్లు అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్, అనుబంధ పార్టీల నేతలను చిన్నకారణాలకే సతాయింపులకు గురిచేస్తోందన్నారు. గ్యారంటీ పథకాలకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూచి సహించలేక ఆరోపణలు చేస్తున్నారని, వాటిని పార్టీ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మహిళల కోసం ఉచిత బస్సు సంచారం, గృహలక్ష్మి పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. తొలుత పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ వేదికపై సౌమ్యారెడ్డికి పార్టీ పతాకాన్ని అందించి.. బాధ్యతలు కట్టబెట్టారు. కార్యక్రమంలో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, మహిళ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబా, రాష్ట్ర మహిళ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ పుష్పఅమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హావేరి బాలుడు క‘న్నీటి’పాలు



నివేదన్



బాలుని కోసం గాలిస్తున్న పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

హావేరి, న్యూస్‌టుడే : భారీ వర్షంతో నిండుగా ప్రవహిస్తున్న మురుగు కాలువలో గురువారం ఉదయం పడిపోయి, తీవ్రంగా గాయపడిన నివేదన్ బసవరాజ్ గుడగేరి (12) అనే బాలుడిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించినా ప్రయోజనం లేకపోయింది. చికిత్సకు తీసుకువచ్చే సరికే అతను మరణించాడని హావేరి వైద్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం వద్ద రహదారిపైకి నీరు రావడం, మురుగు కాలువ కనిపించక నివేదన్ అందులో పడిపోయాడు. అగ్నిమాపకదళ సిబ్బంది సహకారంతో పోలీసులు శోధించి, బాలుడిని ఆస్పత్రిలో చేర్చినా ఫలితం దక్కలేదని జిల్లాధికారి విజయ మహంతేశ తెలిపారు. హావేరి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లారీ దూసుకొచ్చి.. నలుగురి దుర్మరణం

కలబురగి, న్యూస్‌టుడే : హసనాపుర సమీపంలోని గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో రాఘవేంద్ర (35), ముజాహిద్ (30), హుసేన్‌బి (45), మౌలాబి (50) అనే వ్యక్తులు కన్నుమూశారు. ద్విచక్ర వాహనంపై రాఘవేంద్రతో కలిసి ప్రయాణిస్తున్న పరమానంద, కారులో వెళుతున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సింధగి నుంచి చిత్తాపురకు వెళుతున్న లారీ మొదట బైకును, అనంతరం కారును ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. కారులో ఉన్నవారు రాయచూరు జిల్లా హట్టికి వెళుతున్నట్లు గుర్తించామని కలబురగి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శరణబసప్ప తెలిపారు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, కారులో ఉన్న ముగ్గురు కన్నుమూసినట్లు గుర్తించి- కలబురగి ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హైడ్రోజన్ ట్యాంకర్ బోల్తా

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : హుబ్బళ్లి శివార్లలోని రాయనాళ వంతెన సమీపంలో హైడ్రోజన్ తరలిస్తున్న ఒక ట్యాంకర్ గురువారం ఉదయం పల్టీ కొట్టింది. ట్యాంకర్ పగిలి గ్యాసు లీకు కావడంతో ఆ జాతీయ రహదారిపై రెండు గంటలపాటు వాహన సంచారాన్ని నిలిపి వేశారు. అగ్నిమాపకదళ సిబ్బంది సహకారంతో ఆ ట్యాంకర్‌ను రహదారి నుంచి పోలీసులు పక్కకు తీయించారు.

యువతులకు బంధ విముక్తి

బెళగావి : ఖానాపురలో లక్ష్మణ మంత్రేకర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న లాడ్జ్‌పై పోలీసులు దాడి చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి యువతులను తీసుకువచ్చి, వారితో పడుపు వృత్తి చేయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులతో ఇన్‌స్పెక్టర్ మంజునాథ నాయక్ నేతృత్వంలోని సిబ్బంది దాడి చేశారు. అక్కడ ఐదుగురు యువతులను రక్షించి మహిళా స్వాతంత్ర్య కేంద్రానికి తరలించారు. లాడ్జి యజమాని పరారీలో ఉండగా, 11 మంది యువకులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

మృత్యువులోనూ.. కలసి సాగిపోయారు

బెళగావి, న్యూస్‌టుడే : వారిది విడదీయరాని బంధం. అనూహ్యంగా మృతువు వెంటాడింది. వేర్వేరు చోట్ల చోటుచేసుకున్న రెండు ప్రమాదాల్లో రెండు జంటలు ఈలోకాన్ని వీడిపోయాయి. ఆ వివరాలు.. బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా నొగణిహాళ గ్రామ సమీపాన నదికి అడ్డంగా నిర్మించిన వంతెనపై బైకు అదుపుతప్పి ఘటప్రభ నదిలో పడడంతో దానిపై వెళుతున్న దంపతులు నీట మునిగి గురువారం మరణించారు. మృతులను సురేశ్ బడిగేర, జయశ్రీగా గుర్తించారు. భారీ వర్షాలకు వంతెనపై నీరు ఉండడం, వేగంగా వెళుతున్న సమయంలో టైర్లు జారి వారిద్దరూ నదిలో పడిపోయారు. జయశ్రీ మృతదేహాన్ని అగ్నిమాపకదళ సిబ్బంది వెలికి తీశారు. మరో మృతదేహం కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. హుక్కేరి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యాలహళ్లిలో కారుఢీకొని..

మైసూరు: నంజనగూడు తాలూకా యాలహళ్లి గ్రామ శివార్లలో వర్తుల రహదారిపై సంభవించిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ (55), ఆయన భార్య కుమారి (45) మరణించారు. రహదారిలో మరో వైపుకు వెళ్లేందుకు బైకుపై వేచి చూస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. నంజనగూడు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పట్నం వచ్చిన వాగు



తుపాను ప్రభావం గురువారం కాస్త మందగించగా. మధ్య కర్ణాటకలో సాధారణ వర్షాలు జోరందుకున్నాయి. హావేరి, దావణగెరె, శివమొగ్గ, హుబ్బళ్లి- ధార్వాడ జిల్లాల్లో కుండపోత వానలతో ప్రజలు కకావికలమయ్యారు. పట్టణ ప్రాంతాల వీధులు వాగులను తలపించాయి. హావేరి పట్టణంలో గురువారం ఉదయం కనిపించిన పరిస్థితి ఇదీ.
- న్యూస్‌టుడే, హావేరి

ఆమె మాటలు నమ్మి నిండా మునిగాడు

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : డేటింగ్ యాప్‌లో లీనా జోస్ అనే వ్యక్తి పేరిట వచ్చిన విన్నపాన్ని ఆ వ్యాపారి ఆమోదించాడు. అనంతరం ఇద్దరూ నంబర్లు ఇచ్చి పుచ్చుకున్నారు. తాను అడ్మిరల్ మార్కెట్ ఫోరెక్స్ ట్రేడింగ్ చేస్తున్నానని ఆమె నమ్మబలికింది. ఒక వాట్సప్ గ్రూపులో అతన్ని చేర్చింది. మదుపు చేస్తే లాభం వస్తుందని దశల వారీగా రూ. 1.12 కోట్లను పెట్టుబడిగా పెట్టించింది. ఇప్పుడు ఆమె నంబరు నిరంతరం స్విచ్‌ఆఫ్ వస్తుండడంతో మోసపోయానని గుర్తించిన ఆ వ్యాపారి మంగళూరు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

భారీగా బంగారం స్వాధీనం

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : ఎటువంటి పత్రాలు, దాఖలాలు లేకుండా బంగారం, వెండి తరలిస్తున్న అభిషేక్ అనే యువకుడిని హుబ్బళ్లి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని నుంచి 1.101 కిలోల ఆభరణాలు, 1.463 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని డీసీపీ మహానింగ నందగావి తెలిపారు. ముంబయి నుంచి వీటిని తీసుకువచ్చి, స్థానిక నగల వ్యాపారులకు అందించే ప్రయత్నంలో ఆ వ్యక్తి దొరికాడు. అతని నుంచి మరిన్ని వివరాలను రాబట్టేందుకు విద్యాగిరి ఠాణా పోలీసులు విచారణ చేపట్టారు.



తులా సంక్రమణ వేళ కావేరి మాతకు పూజలు చేస్తున్న అర్చక బృందం

సంభ్రమంగా కావేరి తీర్థోద్భవం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : కన్నడిగుల జీవనాడి, జీవనది, ఆరాధ్యదేవత.. కావేరి మాత! నదీమతల్లి తీర్థోద్భవ వేడుక గురువారం ఉదయం 7.40 గంటలకు తులా లగ్న శుభసమయంలో నిర్వహించారు. నది జన్మించే తలకావేరి బ్రహ్మకుండిక ముంగిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్షలాది మంది ఈ వేడుక వీక్షణకు కదలివచ్చారు. ప్రధాన అర్చకుడు ప్రశాంత్ ఆచార్ నేతృత్వంలో జలవేణికి మంగళ హారతులిచ్చారు. మంత్ర జపాలతో అర్చించారు. పవిత్ర తీర్థాన్ని భక్తులపై ప్రోక్షణ చేశారు. ఈ పవిత్ర జలాన్ని తీసుకువెళ్లటానికి బిందెలు, చెంబులు, సీసాలతో భక్తులు పోటీపడ్డారు. నెల రోజుల పాటు తులాసంక్రమణ ఉత్సవాలు కొనసాగుతాయి. వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బోసురాజు, స్థానిక శాసనసభ్యులు ఎ.ఎస్.పొన్నణ్ణ, డాక్టర్ మంతర్‌గౌడ, ప్రభుత్వ గ్యారంటీ పథకాల అనుష్ఠాన సమితి అధ్యక్షుడు ధర్మజా ఉత్తప్ప, జిల్లాధికారి వెంకటరాజా, పోలీస్ ఉన్నత అధికారి కె.రామరాజన్, అదనపు జిల్లాధికారి ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు. తొలి ఉద్భవ జలంతో మల్లికార్జునుడిని అభిషేకించారు.

పాకిస్థానీలకు విదేశీ సాయం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : జిగణి, పీణ్య, దావణగెరె, ఇతర ప్రాంతాల్లో ఇటీవల దొరికిపోయిన 19 మంది పాకిస్థాన్ పౌరులకు లండన్, ఇతర ప్రాంతాల నుంచి భారీగా నగదు వస్తోందని, వారి ఖాతాలకు ఆ మొత్తాన్ని చేరవేశారని విచారణాధికారులు గుర్తించారు. పాక్ నుంచి అడ్డదారుల్లో ఇక్కడికి చేరుకున్నాక- వివిధ వృత్తులు, పనులు కల్పించుకున్న వారికి లండన్‌లో ఉంటున్న ఒక వ్యక్తి ఇస్తున్న సూచనలకు అనుగుణంగా నడుచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. మరో 30 మంది పాకిస్థాన్ ప్రజలు ఉత్తరాదిన వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నారని సంబంధిత అధికారులు ధ్రువీకరించారు. ఇప్పటికే బంధించిన వారికి విదేశాంగ శాఖ సహకారంతో పాకిస్థాన్‌కు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర పోలీసు కమిషనర్ బి.దయానంద్ వెల్లడించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యల పరంపర

ఉడుపి, న్యూస్‌టుడే : ఉడుపి జిల్లాలోని నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. కుందాపురలో తన తల్లి ఆరోగ్యం పాడైందన్న ఆవేదనతో నవీన్ డిసౌజా (42) అనే వ్యక్తి ఉరి వేసుకున్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కల్యాణి (82) అనే వృద్ధురాలు కుందాపురలోని వెంకటరమణ స్వామి దేవాలయం వెనుక పుష్కరిణిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుని హఠాన్మరణంతో ఆవేదనకు గురైన కోటె తాలూకా ఆవర్సె గ్రామానికి చెందిన కిరాడి బెళ్ల (65) అనే వ్యక్తి విషం తాగారు. మణిపాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. వ్యక్తిగత సమస్యలతో కాపు పట్టణానికి చెందిన సునీల్ (32) అనే వ్యక్తి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని సంబంధిత పోలీస్ అధికారి వివరించారు.

సండూరుపై జెండా ఎగరేసేదెవరో?

- అభ్యర్థుల ఎంపికకు పార్టీల కసరత్తు
- సంతోష్ ఎస్.లాడ్ వర్సెస్ గాలి జనార్దన్‌రెడ్డి

బళ్లారి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యేగా ఇ.తుకారామ్ రాజీనామా చేయడంతో సండూరు నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల కమిషన్ నవంబరు 13న ఎన్నికల తేదీని ప్రకటించడంతో కాంగ్రెస్, భాజపా అభ్యర్థుల ఎంపికపై నేతలు కసరత్తు ప్రారంభించారు. ఇరుపార్టీల జిల్లా నేతలు ఇప్పటికే అభ్యర్థిని ఎంపిక చేసి పార్టీ అగ్రనాయకత్వం ముందు ఉంచారు. స్థానిక నేతలు నుంచి వ్యతిరేకత వస్తోందని పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా.. అభ్యర్థి కంటే పార్టీ జెండా ముఖ్యం.. అభ్యర్థి గెలుపునకు శ్రమిస్తామని నేతలు ప్రకటిస్తున్నారు.

కాంగ్రెస్‌కు కంచుకోట

బళ్లారి జిల్లాలో సండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట..1956 నుంచి 2004 వరకు సండూరు రాజవంశస్తులైన ఎం.వై.ఘోర్పడే అడ్డాగా ఉంది. 1983లో హిరోజీ వి.ఎస్.లాడ్ వై.ఘోర్పడేతో అండతోనే గెలుపొందారు. 1983లో రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకోవడంతో సండూరు విధాన సభ నియోజకవర్గం నుంచి యు.భూపతి పోటీ చేసి గెలుపొందారు. 2004లో ప్రత్యక్ష ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు ఎం.వై.ఘోర్పడే ప్రకటించారు. 2004 విధానసభ ఎన్నికల్లో సంతోష్ ఎస్.లాడ్ జేడీఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన గెలుపొందారు. 2008 విధానసభ ఎన్నికలకు సండూరు నియోజకవర్గం ఎస్టీ రిజర్వేషన్ కావడంతో 2008, 2013, 2019, 2023లో వరుసగా నాలుగు సార్లు సంతోష్ ఎస్.లాడ్ శిష్యుడు, అత్యంత ఆప్తుడు ఇ.తుకారామ్ గెలుపొందారు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బళ్లారి నియోజకవర్గం నుంచి తుకారామ్ పోటీ చేసి గెలుపొందడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.


సండూరు నియోజకవర్గం నమూనా

అభ్యర్థి ఎంపిక సంతోష్ ఎస్.లాడ్‌దే

సండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరనేది సంతోష్ ఎస్.లాడ్ ఎంపిక చేసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు సంతోష్ ఎస్.లాడ్‌పై భారం వేసినట్లు తెలిసింది. తుకారామ్ సతీమణి అన్నపూర్ణ తుకారామ్ పేరు దాదాపు ఓ కొలిక్కి వచ్చింది. తుకారామ్‌కు ఎంపీ టికెట్ ఇస్తే గెలిపించాం. ఉప ఎన్నికల్లో వారి కుటుంబసభ్యులకు వద్దు.. పార్టీలో వేరే వ్యక్తికి అవకాశం కల్పించాలని పలువురు పార్టీ నేతలు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ వద్దకు వెళ్లినట్లు తెలిసింది. అసంతృప్తిగా ఉన్న పార్టీ నేతలను సమాధానపరిచి అభ్యర్థిని ఎంపిక చేయాలని మంత్రి సంతోష్ ఎస్.లాడ్ భుజాలపై వేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జడ్పీ మాజీ సభ్యుడు తుమటి లక్ష్మణ, శివరామ్ భీమప్ప టికెట్ కోసం దరఖాస్తులు సమర్పించారు. రెండు రోజుల్లో కాంగ్రెస్ అభ్యర్థి పేరు ప్రకటించే అవకాశాలు ఉన్నాయని పార్టీ నేతలు తెలియజేస్తున్నారు.


అన్నపూర్ణ (కాంగ్రెస్) తమటి లక్ష్మణ(కాంగ్రెస్) కె.ఎస్.దివాకర్(భాజపా) బి.శ్రీరాములు(భాజపా) వై.దేవేంద్రప్ప(భాజపా)

ఖాతా తెరవడానికి భాజపా కసరత్తు

1956 నుంచి 2023 వరకు జరిగిన సండూరు విధానసభ ఎన్నికల్లో భాజపా ఒక్కసారీ గెలవలేదు. 2008 విధానసభ ఎన్నికల్లో జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో భాజపా గెలుపొందినా. సండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. ఈ ఎన్నికల్లో భాజపా ఖాతా తెరవడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఉప ఎన్నిక బాధ్యత మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి భుజాలపై వేసుకున్నారు. కె.ఆర్.పి.పి.ని భాజపాలోకి విలీనం చేయడం, సర్వోన్నత న్యాయస్థానం అనుమతితో 14 ఏళ్ల తర్వాత బళ్లారి జిల్లాకు వచ్చిన తర్వాత మొదటి ఎన్నిక జరుగుతుండటంతో సండూరు ఉప ఎన్నికల్లో భాజపా జెండా ఎగురవేసి పార్టీ అధిష్ఠానంతో మార్కులు కొట్టివేయడానికి కసరత్తు ప్రారంభించారు. మాజీ మంత్రి బి.శ్రీరాములు పోటీకి దూరంగా ఉన్నట్లు ప్రకటించారు. స్థానికలతో పాటు, కార్తీక్ ఘోర్పడే స్థానికలకు అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠానం కోరినా.. మాజీ మంత్రి జనార్దన్‌రెడ్డి పార్టీ అధిష్ఠానం టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ అభ్యర్థి గెలుపునకు శ్రమిస్తామని ప్రకటించారు. కార్యకర్తలకు అండగా నిలిచిన కె.ఎస్.దివాకర్‌కు ఇవ్వాలని పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. తాను బలపరిచిన అభ్యర్థికి టికెట్ ఇస్తే గెలిపించుకుని వస్తామని పార్టీ భరోసా ఇచ్చినట్లు తెలిసింది. సండూరు ఉప ఎన్నికను గాలి జనార్దన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఉప ఎన్నికల్లో భాజపా నుంచి మాజీ లోక్‌సభ సభ్యుడు వై.దేవేంద్రప్ప, మాజీ మంత్రి బి.శ్రీరాములుతో పాటు 19 మంది టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సండూరు నియోజకవర్గం ఎన్నిక నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాక ముందే వేడెక్కింది.

'గాలి' రాజభవనం తెరిచినా కాంగ్రెస్ గెలుపు తథ్యం

ఎమ్మెల్యే నాగేంద్ర స్పష్టీకరణ


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.నాగేంద్ర

బళ్లారి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే, మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి సండూరులో ఇల్లు కాదు.. ప్యాలెస్ ప్రారంభించినా ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు తథ్యం(ఫిక్స్) అని గ్రామీణ శాసనసభ్యుడు బి.నాగేంద్ర ధీమా వ్యక్తం చేశారు. గురువారం తన నివాసం వద్ద కలిసిన విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి సముదాయంలో పుట్టిన తాను వాల్మీకి మండలిలో జరిగిన అక్రమాలపై మాట్లాడానికి మనసు రావడం లేదు. మనసును రాయి చేసుకుని మాట్లాడుతున్నాను. నేను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు. భాజపా కుతంత్ర రాజకీయంలో సీబీఐ, ఈడీని ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. మొదట నన్ను లక్ష్యం చేసుకుని కేసుపై జైలుకు పంపారు. త్వరలో నిజానిజాలు బయటకు వస్తాయన్నారు. భాజపా భయంతో తన పార్టీని విలీనం చేశారు. ఈడీ, సీబీఐకి రెడ్డి భయపడి భాజపాలో చేరారు. కేఆర్‌పీపీ స్థాపించిన సందర్భంలో రెడ్డి భాజపాను ఎలా విమర్శించారో రాష్ట్ర ప్రజలకు తెలుసు.. యూపీఏ ప్రభుత్వంలో జైలుకు పంపినట్లు ఆరోపణలు చేయడంపై రెడ్డి ఆలోచించాలి. భాజపా, రెడ్డి జతలో ఉంటే తాము మంచి వాళ్లమా? ఇప్పుడు పార్టీ మారితే నాగేంద్ర అక్రమాలకు పాల్పడినట్లు భరిస్తారా? ఆయనకు కొద్దిగా ఆత్మ ఉంటే ఆలోచన చేసి మాట్లాడాలి. అంటూ చురకలంటించారు. గాలి జనార్దన్‌రెడ్డి బళ్లారికి వస్తే తమ పార్టీపై ఎలాంటి ప్రభావం ఉండదు. సండూరు ఉప ఎన్నికల్లో గెలుపు పొందేది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థే.. దీనిపై ఎలాంటి అనుమానం లేదన్నారు. గాలి జనార్దన్‌రెడ్డి కాదు. ఎవరు వచ్చినా సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కచ్చితమన్నారు.

అయ్యో..పాపం!

వీధి కుక్కల దాడిలో బాలుడి మృతి

చదువంటే ప్రాణం ఆ బాలుడికి.. చక్కగా చదివి గొప్పవాడు కావాలనే పట్టుదలతో క్రమం తప్పకుండా బడికెళ్లేవాడు. నవోదయ పరీక్ష రాసి ఎలాగైనా ఉత్తీర్ణుడవ్వాలని రోజూ శిక్షణ పొందుతున్నాడు. కుక్కల రూపంలో వచ్చిన మృత్యువు అమాంతం అతన్ని కబళించింది. ట్యూషన్‌కెళ్లొస్తా నాన్నా అంటూ టాటా చెప్పి వెళ్లిన కొడుకు శవమై కనిపించడాన్ని ఆ కుటుంబ సభ్యులు గుండెలు బాదుకున్నారు. [illegible] కుక్కల దాడిలో ఆ బాలుడు మృతిచెందిన హృదయవిదారక ఘటన మొళకాల్మూరు తాలూకాలో జరిగింది.


గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతూ పిల్లల ప్రాణాలను హరిస్తున్న వీధి కుక్కలు

చెళ్లకెరె(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: వీధి కుక్కల దాడిలో మిథున్ (10) అనే బాలుడు మృతి చెందిన సంఘటన మొళకాల్మూరు తాలూకా రాంపురం గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాంపురం గ్రామానికి చెందిన చన్నమల్లికార్జున కుమారుడు మిథున్ అదే గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో అయిదో తరగతి చదువుతున్నాడు. మొరార్జీ దేశాయి, నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్షలకు శిక్షణ పొందడానికి ఉపాధ్యాయుడి వద్ద ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి వెళ్తుండగా వీధి కుక్కలు అతన్ని చుట్టుముట్టాయి. దీంతో భయపడి పరుగెత్తుతూ అదుపు తప్పి నేలపై పడిపోవడంతో అతన్ని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. బాలుడు రక్త గాయాలతో కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న బాటసారులు గమనించి వీధి కుక్కలను తరిమి వేసి బాలుణ్ని రక్షించారు. బాలుడి పరిస్థితి విషమించడాన్ని గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి, అతని తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం వెంటనే బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రాంపురం ఠాణాలో కేసును నమోదు చేసుకొని విచారిస్తున్నారు. కొద్దినెలల క్రితం మేదేహళ్లి గ్రామంలోనూ వీధి కుక్కల దాడిలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే.


మిథున్ (పాతచిత్రం)

59 గృహాలకు వానదెబ్బ

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: చెళ్లకెర తాలూకాతో పాటు జిల్లాలోని పలు చోట్ల కురిసిన వర్షాలకు మొత్తం 59 గృహాలకు హాని కలిగినట్లు అధికారులు తెలిపారు. గురువారం అనేక చోట్ల వర్షం కురిసింది. భరమసాగరలో అత్యధికంగా 52 మి.మీ. వర్షపాతం నమోదైందని చెప్పారు. తురువనూరులో 31, పరశురాంపురంలో 30, హిరేగుంటనూరులో 29, ధర్మపురంలో 28, చెళ్లకెరలో 24, తళకులో 19, రామగిరిలో 16 మి.మీ. వర్షపాతం నమోదైంది. వేదవతి నదిలో వరద ప్రవాహం పెరిగి 2,450 క్యూసెక్కులకు చేరుకుంది. వాణీవిలాస్ జలాశయం భర్తీ కావడానికి మరో 7 అడుగుల నీరు చేరాల్సి ఉంది.


అధిక వర్షాలకు ఈచలనాగేహళ్లిలో కూలిన ఇల్లు

వాల్మీకి నిధుల దుర్వినియోగం నిజం

సండూరు ఉప ఎన్నిక గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి, చిత్రంలో అనిల్‌కుమార్ మోకా, గాలి సోమశేఖర్‌రెడ్డి, హనుమంతప్ప

బళ్లారి, న్యూస్‌టుడే: అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి నన్ను భాజపా కుతంత్ర రాజకీయంతో అరెస్టు చేసినట్లు బి.నాగేంద్ర మాట్లాడటం సరికాదు. భాజపాపై ఆరోపణలు చేయడం సరికాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు నాగేంద్ర, ఆనంద్‌సింగ్, సురేష్‌బాబు, సతీష్ సైల్, అనిల్ హెచ్.లాడ్‌లను గత యూపీఏ ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఇది బి.నాగేంద్ర మరచిపోయారా? అని ప్రశ్నించారు. ఈడీ ఛార్జిషీట్‌లో వాల్మీకి మండలి నిధులతో విమాన టికెట్లు, విలువైన కారు కొనుగోలు తదితర విషయాలు బహిర్గతం చేసింది. మండలి నిధులు వేర్వేరు బ్యాంకు ఖాతాలకు జమచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో రూ.14.80 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులను ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, గణేష్, కూడ్లిగి శాసనసభ్యుడు డా.శ్రీనివాసకు అందజేసి, ఓటుకు రూ.200 చొప్పున పంచినట్లు ఈడీ ఛార్జిషీట్‌లో పొందుపరిచినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 15 నెలల అధికార అవధిలో వాల్మీకి నిధులు, సిద్ధార్థ ట్రస్ట్‌కు నివాసం, ముడా ఆరోపణలు వచ్చాయి. వాల్మీకి సముదాయంలో జన్మించిన బి.నాగేంద్ర ఇదే నిధులను దుర్వినియోగం చేసి, సముదాయానికి ద్రోహం చేశారని ఆరోపించారు. కిష్కింద, హొసపేటె, కొప్పళ, బళ్లారి జిల్లాలోని అటవీ ప్రదేశాన్ని వాల్మీకి అభయారణ్య అని నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు జనార్దన్‌రెడ్డి తెలిపారు. సండూరు ఉప ఎన్నికల్లో భాజపా గెలుపు తథ్యం. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటా. శుక్రవారం సండూరులో గృహ ప్రవేశం చేస్తున్నాను అని చెప్పారు. ఈ ఉప ఎన్నికల్లో ప్రతి గ్రామం, ప్రతి ఇంటికీ వెళ్లి భాజపాకు ఓటు వేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో బి.నాగేంద్రను తాను లెక్కలోకి తీసుకోలేదన్నారు. సండూరు ఉప ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపునకు శ్రమిస్తామన్నారు. శ్రీరాములు, తనకు మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, హెచ్.హనుమంతప్ప, డా.బి.కె.సుందర్, ఓబళేష్ తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు.

కారాగారం నుంచే హనీట్రాప్‌కు ప్రణాళిక

కలబురగి: కారాగారంలో ఖైదీలు గంజాయి, చరవాణి వినియోగిస్తున్న ఆరోపణలపై అధికారులు సోదా చేస్తూ ఉంటారు. బెంగళూరు మల్లేశ్వరంలో పేలుడు ఘటనలో నిందితుడు, అనుమానిత తీవ్రవాది జుల్ఫిక్, శివమొగ్గకు చెందిన రౌడీషీటర్ బచ్చన్ ఇద్దరూ కలబురగి కేంద్ర కారాగారంలో ఒకే బ్యారక్‌లో ఉండేవారు. వీరిద్దరూ కారాగారం నుంచే శ్రీమంతులకు ఫోన్లు చేసి మీ నగ్న చిత్రాలు ఉన్నాయని, కొందరు యువతులతో నగ్నంగా మారి ఫోను చేశారని బెదిరించి, తమ ఖాతాలకు నగదు వేయించుకునేవారు. కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న సాగర్ అనే ఖైదీని ఇలాగే బెదిరించారు. తమకు పరిచయం ఉన్న ఒక యువతితో సాగర్ నగ్నంగా మారి మాట్లాడేలా చేశారు. అనంతరం ఆ వీడియో పెట్టుకుని మీ కుటుంబ సభ్యులకు చెప్పి తమ ఖాతాలో నగదు వేయించాలని బెదిరించారు. సాగర్ ఫిర్యాదుతో నిందితుల నుంచి సెల్‌ఫోన్ జప్తు చేసుకున్నారు. వారిద్దరినీ వేర్వేరు బ్యారక్‌లకు మార్చి విచారణ చేపట్టారు.

రాజధాని దారులు విలవిల

వాన ఆగింది.. పెను నష్టం కళ్లముందు కదలాడుతోంది. దేశ, విదేశీ ఐటీ సంస్థలకు పేరొందిన బెంగళూరు నగర వీధుల్లో గురువారం సంచారం ఏమంత తిన్నగా సాగలేదు. వాహనాలన్నీ కుదుపునకు లోనయ్యాయి. నడక మార్గాలు ఒడిదొడుకుల పాలయ్యాయి. మొన్నటికి మొన్న పూడ్చిన గోతులన్నీ మళ్లీ ప్రత్యక్షమై.. నరకాన్ని తలపించాయి.


రహదారుల విధ్వంసానికి పరాకాష్ట.. ఇలాంటి చిత్రాలు కోకొల్లలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వానల దెబ్బకు రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలో రహదారులు సర్వనాశనమయ్యే పరిస్థితి ఎదురవుతోంది. ఆ మార్గాల్లో వాహన సంచారం పెద్ద సమస్యగా మారింది. మొన్నటికిమొన్న రహదారులపైపడిన గుంతలను సంచార పోలీసులు మట్టి వేసి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించినా.. ఇక్కట్లు మొదటికొచ్చాయి. వారం రోజులుగా దారులన్నీ బురద మాయం కావడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సర్జాపుర, బెళ్లందూరు, యలహంక, కె.ఆర్.పురం, టిన్‌ఫ్యాక్టరీ, బెన్నగానహళ్లి, రింగ్‌రోడ్డు, రామమూర్తినగర, టీసీ పాళ్య, వడ్డెరపాళ్య తదితర ప్రాంతాల్లోని రహదారులు పూర్తిగా పాడైనట్లు పాలికె అధికారులు గుర్తించారు. కురిసిన వర్షాలకు 350 కిలో మీటర్ల రహదారులు పాడైనట్లు ప్రాథమికంగా తేలింది. వాటిపై మూడువేల గుంతలు పడినట్లు అంచనా వేస్తున్నారు. వాటిని పూడ్చేందుకు పాలికె ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. వర్షం కురిసే సమయంలో గుంతలు పూడ్చటం సాధ్యం కాదని పాలికె వర్గాలు స్పష్టం చేశాయి.


సాయిలేఅవుట్ నివాసులకు ఆహార పొట్లాలు అందిస్తున్న పాలికె సిబ్బంది

నిండాము నిగిన శివారుకాలనీ..

రాజధాని నగరంలో ఈసారి వర్షాలకు బాగా నష్టపోయిన కృష్ణరాజపురం సమీప సాయిలేఅవుట్ నివాసులకు సాయం చేయడానికి బెంగళూరు పాలికె అధికారులు ముందుకొచ్చారు. అక్కడి బాధితులకు బుధవారం రాత్రి భోజనం, తాగునీటిని సమకూర్చారు. గురువారం ఉదయం అల్పాహారం, తాగునీటి సీసాలను ఇంటింటికీ చేరవేశారు. ఏడు నెలల కిందట ఇదే కాలనీలో కురిసిన వర్షానికి ఇళ్లన్నీ ముంపు పాలయ్యాయి. ఈసారీ అవే ఇక్కట్లు ఎదురయ్యాయి. అక్కడ స్తంభించిన నీటి మడుగులను గురువారం ఉదయం నుంచి అగ్నిమాపక సిబ్బంది, యంత్రాల సాయంతో బయటకు తరలిస్తున్నారు. కొంత నీటి మట్టం తగ్గినా బురద మేటవేసినట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు శ్రమిస్తున్నారు. ఇక్కడి అనేక నివాసాలను ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి వెళుతున్నారు. కొందరైతే విక్రయానికి పెడుతున్నారు. బాధలను తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రాలేదని బాధితులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.



అడుగడుగునా గుంతలు పడిన సర్జాపుర రహదారి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత డయాలసిస్ సేవలు


వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, చిత్రంలో వైద్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: మూత్రపిండ సమస్యలతో బాధపడే వారికి బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రం (బీఎంసీఆర్‌సీ), బళ్లారి జిల్లా ఆసుపత్రి, సండూరు, సిరుగుప్ప తాలూకా ఆసుపత్రుల్లో ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా వెల్లడించారు. జిల్లా పాలనాధికారి కార్యాలయంలో బీఎంసీఆర్‌సీ, కుటుంబ సంక్షేమశాఖాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీ మాట్లాడుతూ డయలైజర్, బ్లడ్ ట్యూబ్‌లను ఒకే వ్యక్తికి 5 నుంచి 6 సార్లు తిరిగి ఉపయోగించడానికి అనుమతి ఉందన్నారు. ఇలాంటి వదంతులను వినకుండా రోగులు డయాలసిస్ సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రభుత్వ వైద్యులు శ్రమించాలన్నారు. బీపీఎల్, ఏపీఎల్ రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బీఎంసీఆర్‌సీలో 13, జిల్లా ఆసుపత్రిలో 8, సండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు, సిరుగుప్ప ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బళ్లారి నగరంలో డయాలసిస్ సేవలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు నిర్దిష్ట ధరలు మాత్రమే తీసుకోవాలన్నారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ కల్యాణశాఖాధికారి యల్లా రమేష్‌బాబు, బీఎంసీఆర్‌సీ డైరెక్టర్ గంగాధరగౌడ, జిల్లా ఆసుపత్రి బాధ్యుడు బసరెడ్డి, వైద్యులు మరియంబి, చిదంబరమూర్తి, వీరేంద్రకుమార్, అన్వర్, రాఘవేంద్ర, రామకృష్ణ, రోహన్ వనగుంది, శ్రీనివాస్, జబీనాతాజ్, మయూరి పాల్గొన్నారు.

గోసంరక్షకుడికి మహర్షి వాల్మీకి పురస్కారం


కిలారి జోగయ్య


పశువులను మేతకు తోలుకెళ్తున్న కాపరి

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: నిస్వార్థ చింతనతో పశువుల సంరక్షణ, గిరిజన సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్న చెళ్లకెర తాలూకా గుడ్డదారహట్టికి చెందిన పశువుల కాపరి కిలారి జోగయ్యను ఈ సారి రాష్ట్ర స్థాయి మహర్షి వాల్మీకి అవార్డు వరించింది. గురువారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ప్రభుత్వం మహర్షి వాల్మీకి పురస్కారం కింద 20 గ్రాముల బంగారు పతకం, రూ.5 లక్షల నగదు బహుమతి, జ్ఞాపికను అందుకొన్నారు. చెళ్లకెర తాలూకాలో అత్యధికంగా గిరిజన సంస్కృతికి చెందిన నాయక సామాజిక వర్గం ప్రజలు దేవుని కోసం వదలిన పశువులను సంరక్షించి పోషించడం కిలారి జోగయ్య ప్రధాన వృత్తి. కన్నడ భాషలో కిలారి అంటే పశువుల పోషకుడని అర్థం. చిన్నతనం నుంచి వీరు పశువుల కాపలాకాయడమే వృత్తిగా స్వీకరించడంతో వీరి పేరులోనే కిలారి అనే అన్వర్థనామంగా చేరిపోయింది. దేవుని పశువుల పోషణ చేసి గిరిజన సంస్కృతిని పరిరక్షించుకొని వస్తున్న కిలారి జోగయ్యకు రాష్ట్ర స్థాయి మహర్షి వాల్మీకి పురస్కారం రావడం జిల్లాలోని ఈ వర్గం నాయక సమాజానికి లభించిన గౌరవంగా పలువురు పేర్కొన్నారు. గతంలో ఈ పురస్కారాన్ని చిత్రదుర్గానికి చెందిన మదకరి నాయక విద్యా సంస్థ సంస్థాపకుడు దివంగత డి.బోరప్ప, చెళ్లకెరకు చెందిన మాజీ మంత్రి దివంగత తిప్పేస్వామి అందుకున్నారు.

శారదాశ్రమ నిర్మాణానికి భూమిపూజ

హొసపేటె, న్యూస్‌టుడే: స్థానిక హంసాంబ శారదాశ్రమ నిర్మాణానికి గురువారం సాయంత్రం భూమిపూజ చేశారు. గదగ-విజయపుర రామకృష్ణ, వివేకానందాశ్రమ అధ్యక్షుడు నిర్భయానంద స్వామీజీ నేతృత్వంలో శాస్త్రోక్తంగా భూమిపూజ కార్యక్రమాలు నెరవేరాయి. ఆశ్రమానికి వస్తున్న భక్తుల సంఖ్య పెరిగింది. ప్రార్థన, ఇతర కార్యక్రమాలు నిర్వహించటానికి ఇబ్బందికరంగా ఉండేది. ఈ నేపథ్యంలో దాతల సహకారంతో కొత్త ఆశ్రమం నిర్మాణం చేస్తామని స్థానిక హంసాంబ శారదాశ్రమం అధ్యక్షురాలు మాతా ప్రబోధమయి తెలిపారు. ఈ సందర్భంగా కిర్లోస్కర్ ఫెరస్ ఇండస్ట్రీస్ ఎండీ ఆర్.వి.గుమాస్తె తదితరులు పాల్గొన్నారు.


హొసపేటెలో హంసాంబ శారదాశ్రమ నిర్మాణానికి చేపట్టిన భూమిపూజలో పాల్గొన్న స్వాములు, స్థానిక ప్రముఖులు

రోడ్డుప్రమాదంలో సోదరుల మృతి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాజధాని పరిధి దేవీనగరలో బుధవారం అర్ధరాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. నాగరబావి నివాసి రాజేశ్ కుమార్ (27), దొడ్డబొమ్మసంద్ర నివాసి నాగరాజు (30)లను మృతులుగా గుర్తించారు. వరుసకు వీరిద్దరూ అన్నదమ్ములు. శిరస్త్రాణం లేకుండా విద్యుత్తు వాహనంలో వెళుతున్న సమయంలో వాహనం అదుపు తప్పి రహదారి విభాజకాన్ని ఢీకొట్టారు. తలకు తీవ్రంగా గాయాలైన వీరిని బాప్టిస్టు ఆసుపత్రికి తరలించేలోగా మార్గమధ్యంలో మరణించారు. వీరి వద్ద మారణాయుధాలు ఉండడంతో దారి దోపిడీలకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానించినా.. ఇప్పటి వరకు వీరిపై ఒక్క కేసు కూడా లేదని హెబ్బాళ ట్రాఫిక్ ఠాణా పోలీసులు స్పష్టం చేశారు.

బెంగళూరు లాడ్జిలో తహసీల్దార్ కన్నుమూత

శివమొగ్గ, న్యూస్‌టుడే : తీర్థహళ్లి తహసీల్దారు జీబీ జక్కనగౌడర్ (54) బెంగళూరు ఉప్పారపేటలోని ఒక లాడ్జిలో మరణించారని గుర్తించారు. కోర్టు పనిపై నగరానికి వచ్చి లాడ్జిలో ఉన్నారు. మంగళవారం రాత్రి నుంచి ఆయన ఫోన్‌కాల్‌కు స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గదిలోనే జక్కనగౌడర్ మృతదేహం ఉందని గురువారం గుర్తించారు. గుండెపోటుతో మరణించారని పోలీసులు అనుమానిస్తున్నారు. తీర్థహళ్లిలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో గృహిణి విషాదాంతం

బెళగావి, న్యూస్‌టుడే : బైలహొంగల తాలూకా హొసూర గ్రామంలో స్నానానికి వేడి నీరు కాచేందుకు పెట్టిన హీటర్ కాయిల్‌ను పొరపాటున పట్టుకున్న రేఖ (36) అనే గృహిణి విద్యుదాఘాతంతో మరణించింది. ఆమె కుటుంబ సభ్యులు గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆమె మృతి చెందింది. మురగోడ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధతోనే.. కానరాని లోకాలకు..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బెంగళూరు శివారు యలహంక పరిధి సింగనాయకహళ్లి యడియూరప్ప లేఅవుట్‌లో క్యాబ్ డ్రైవరు అవినాశ్(33), అతని భార్య మమత (30), ఇద్దరు పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు. వారం రోజుల కిందట వారు విగతజీవులుగా మారిన విషయం తెలిసిందే. కలబురగి నుంచి నగరానికి వచ్చిన అవినాశ్ క్యాబ్ డ్రైవరుగా, మమత ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసేవారు. వారికి అధీయ (5) అనే కుమారుడు, అనయ (3) అనే కుమార్తె ఉన్నారు. బిడ్డలకు మంచి భవిష్యత్తు కల్పించాలని అవినాశ్ కోరుకునేవాడు. ఇదే క్రమంలో ఒక క్రెడిట్ కార్డు తీసుకున్నాడు. ఒకదాని అనంతరం మరోటి చొప్పున కార్డుల సంఖ్యను పెంచుకుంటూ వెళ్లాడు. అప్పు ఎలాగైనా తీర్చవచ్చని భావించి.. చివరికి విఫలమయ్యాడు. ఆ కార్డులను వెనక్కు ఇచ్చి, అప్పులను తీర్చేద్దామన్నా వినకపోవడంతో తన ఇద్దరు బిడ్డలకు విషాహారం పెట్టి, తాను కూడా తిని మమత ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన అనంతరం జరిగిన ఘటనను చూసి ఆవేదనతో మృతదేహాలకు ఉరి తాళ్లు కట్టి వేలాడదీసి, తానూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని రాజానుకుంటె ఠాణా పోలీసులు గుర్తించారు.

బళ్లారి

•బళ్లారి •రాయచూరు

హరపనహళ్లి కళాకారిణికి వాల్మీకి పురస్కారం

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏటా ఇస్తున్న వాల్మీకి పురస్కారానికి కలబరగి విభాగంనుంచి హరపనహళ్లికి చెందిన కళాకారిణి రత్నమ్మ బి.సోగి(70) ఎంపికయ్యారు. బుధవారం ప్రభుత్వం వాల్మీకి రాష్ట్రస్థాయి పురస్కృతుల జాబితా విడుదల చేసింది. పురస్కృతులకు జ్ఞాపికం, రూ.5లక్షల నగదు, 20 గ్రాముల బంగారు నాణెం ఇవ్వనున్నారు. నిరుడు కూడ్లిగి తాలూకా బిష్ణహళ్లికి చెందిన హండిజోగి సముదాయం బైలాట కళాకారుడికి వాల్మీకి పురస్కారం దక్కడం తెలిసింది. సుమారు 50 ఏళ్ల నుంచి రత్నమ్మ సోగి కళామతల్లి సేవలందిస్తున్నారు. జానపద, పౌరాణిక, సామాజిక నాటకాల్లో నటించారు. ఏకపాత్రాభినయంలో ఆమెకి పెట్టింది పేరు. పలు కన్నడ ధారావాహికల్లోనూ అభినయించారు. జిల్లాలోని ప్రముఖ కళాకారులు ఆమెను అభినందించారు.

ఆలోచనా విధానంలో మార్పు రావాలి

కంప్లి, న్యూస్‌టుడే: మనిషి తలచుకుంటే ఏదైనా సాధించగలడు. ఆలోచనా విధానంలో మార్పు రావాలని జేసీఐ 24 వలయ శిక్షకురాలు, బళ్లారి స్టీల్ సిటీ శాఖ ప్రతినిధి టి.ఎల్.శారద ప్రియ పిళ్లై అభిప్రాయపడ్డారు. కంప్లిలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె సానుకూల ఆలోచన(పాజిటివ్ థింకింగ్) అనే విషయంపై మాట్లాడారు. ఈ పని మనతో కాదు. నేను చేయలేను అన్న ఆలోచనతోనే మనిషి ఉంటాడు. ప్రతికూల ఆలోచనలను దరిచేరనీయక సానుకూలంగా ఆలోచిస్తూ ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చు. యువత సానుకూలంగా ఆలోచిస్తూ ముందడుగు వేయాలని సూచించారు. జేసీఐ 24 వలయ ఉపాధ్యక్షుడు సంతోష్ సోగి, జేసీఐ కంప్లి సోనా అధ్యక్షుడు సుహాస్ చిత్రగార్, సిద్ధరామేశ్వర, అమరనాథ శాస్త్రి, పూర్ణచంద్ర పాల్గొన్నారు.


వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యేలు బి.నాగేంద్ర, నారా భరత్‌రెడ్డి, మండలి అధ్యక్షుడు ముండరగి నాగరాజ, మేయర్ ముల్లంగి నందీష్


కార్యక్రమానికి హాజరైన సముదాయం ప్రముఖులు


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


నృత్య ప్రదర్శనలో విద్యార్థులు, కళాకారుడు జలానిబాషా


చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏడీసీ మహమ్మద్ ఝుబేర, పాలికె కమిషనర్ ఖలీల్‌సాబ్ తదితరులు

గొప్ప దార్శనికుడు వాల్మీకి మహర్షి

ఘనంగా నివాళి


బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో..

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి అపారమైన విజ్ఞాన భాండాగారమని మాజీ మంత్రి, గ్రామీణ శాసనసభ్యుడు బి.నాగేంద్ర గుర్తుచేశారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, నగర పాలికె, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నల్లచెరువులోని వాల్మీకి భవనంలో ఏర్పాటు చేసిన వాల్మీకి జయంతిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాల్మీకి మహర్షి కవి మాత్రమే కాదు. గొప్ప పాలకుడు, గురువు, గొప్ప రుషి అన్నారు. సమాజానికి విద్య, సంస్కృతి, సామాజిక న్యాయం అనే భావనను నిలబెట్టే రామాయణం సుపరిపాలనకు నమూనాగా నిలిచిందన్నారు. వాల్మీకి మహర్షి రామాయణం రచన ద్వారా పితృత్వం, మాతృత్వం, పతి-సతి మధ్య సంబంధాన్ని చెప్పారు. రానున్న రోజుల్లో వాల్మీకి సమాజం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణంలోని ఆదర్శ పురుషుడు శ్రీరాముని మనమంతా జపిస్తున్నాం. వాల్మీకినీ పూజించాలన్నారు. మహర్షి నిర్దేశించిన బాటలో యువత నడిచి సమాజాభివృద్ధికి శ్రమించాలని కోరారు. రాష్ట్ర మండలి అధ్యక్షుడు ముండరగి నాగరాజ, మేయర్ ముల్లంగి నందీష్ మాట్లాడారు. కలబురగికి చెందిన ఉపన్యాసకురాలు శ్రీదేవి రత్నగిరి వాల్మీకి మహర్షి గుణగణాలపై ప్రసంగించారు. అనంతరం పదో తరగతి వార్షిక పరీక్షలు, ద్వితీయ పీయూసీ, డిగ్రీ, స్నాతకోత్తర పదవిలో అత్యధిక మార్కులు సాధించిన వారు, పీహెచ్‌డీ అభ్యర్థులను అభినందించారు. కార్పొరేటర్లు, సముదాయం ప్రముఖులు,పలువురు సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఊరేగింపు

మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా బళ్లారి నగరంలో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. తొలుత స్థానిక వాల్మీకి కూడలిలోని వాల్మీకి విగ్రహానికి పలువురు పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం అక్కడ నుంచి పార్వతినగర్ ప్రధాన రహదారి, దుర్గమ్మ దేవస్థానం, భూగర్భ వంతెన, గడిగి చెన్నప్ప కూడలి, బెంగళూరు రహదారి, బ్రూస్‌పేటె, హెచ్.ఆర్.గవియప్ప కూడలి, నుంచి వాల్మీకి భవనం వరకు ఊరేగింపు నిర్వహించారు.


సింధనూరులో వాల్మీకికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నాగేంద్ర కన్నీటిపర్యంతం

వాల్మీకి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.నాగేంద్ర పాల్గొన్నారు. చివరిగా అధ్యక్ష స్థానంలో ఉన్న ఆయన మాట్లాడుతున్న సమయంలో మూడు నెలల జైలు జీవితం గుర్తుచేసుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. నాపై లేనిపోని ఆరోపణలు చేసి, రాజకీయ కుతంత్రాలతో జైలుకు పంపారు. వాల్మీకి మండలి నుంచి ఒక్క రూపాయి దుర్వినియోగం చేయలేదు. బ్యాంకు అధికారులు చేసిన పనికి జైలు జీవనం గడిపాను. వాల్మీకి సముదాయంలో జన్మించి.. మీకు ద్రోహం చేయడానికి నాకు మనసు ఎలా వస్తుందని కన్నీళ్లు పెట్టుకున్నారు. నాపై వచ్చిన ఆరోపణలు పోయిన తర్వాత బళ్లారికి రావాలని ఉండేది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ చెప్పడంతో వచ్చాను. నాపై వచ్చిన ఆరోపణలు నిజమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా దూరమవుతాను. న్యాయస్థానంపై పూర్తి నమ్మకం ఉందని రోదించారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ముండరగి నాగరాజు, సోదరుడు వెంకటేశ్ ప్రసాద్ ఆయనను ఓదార్చారు.

మాన్వి: ఆది కవి, మహర్షిగా పేరుగాంచిన వాల్మీకి ఏ వర్గానికో, ఏ సముదాయానికో పరిమితం కాదని ఆయన అందరికి ఆదిగురువు అని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. గురువారం తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంత్యుత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడారు.


వాల్మీకి విద్యా మండలిలో..

సింధనూరు: సింధనూరు పట్టణం టవర్ క్లాక్ సమీపంలోని వాల్మీకి కూడలిలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఘననివాళి అర్పించారు. మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప, ఎమ్మెల్యే తనయుడు రాజుగౌడ బాదర్లి, భాజపా నాయకుడు రాజేశ్ హిరేమఠ్ తహసీల్దారు అరుణ్‌దేశాయ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహర్షి వాల్మీకి జీవనం నేటి యువతకు ఆదర్శప్రాయం కావాలని కేవీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

హొసపేటె: ప్రతి ఇంట్లో ఓ రామాయణం పుస్తకం ఉండాలి. పిల్లలు ఇప్పటి నుంచే ఆ గ్రంథాన్ని చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, గిరిజన సంక్షేమశాఖల సంయుక్తాధ్వర్యంలో గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన వాల్మీకి జయంత్యుత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రామాయణంలో అన్ని మంచి, చెడు పాత్రలు వస్తాయి. మర్యాద పురుషుడు శ్రీరామచంద్రుడు, స్వామి భక్తికి మారు పేరైన హనుమంతుడు, వదినను తల్లిగా భావించే లక్ష్మణుడు, అన్నమాట శిరసావహించే భరతుడు, మహా శివభక్తుడైన రావణుడు రామాయణంలో దర్శనం ఇస్తారన్నారు. ఎమ్మెల్యే గవియప్ప మాట్లాడుతూ వాల్మీకి సమాజానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను, పట్టణాభివృద్ధికి అందరూ చేతులు జోడించాలని కోరారు. నగరసభ అధ్యక్షుడు రూపేశ్‌కుమార్ మాట్లాడారు. ఎస్పీ శ్రీహరిబాబు, అదనపు డీసీ బాలకృష్ణప్ప, ఏసీ వివేకానంద, హుడా అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజి, వాల్మీకి నాయక సమాజ అధ్యక్షుడు గుజ్జల శ్రీనాథ్ పాల్గొన్నారు. పది, పీయూసీ, డిగ్రీలో ఎక్కువ మార్కులు తీసుకున్న విద్యార్థులను సన్మానించారు. సమాజానికి చెందిన లింగసూగూరు న్యాయమూర్తి కె.అంబణ్ణ, చిత్రదుర్గ డీఎస్పీ ఎస్.ఎస్.చంద్రశేఖర్, వర్సిటీ ఆచార్య తారిహళ్లి హనుమంతప్ప, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ జంబయ్య నాయకలను సన్మానించారు.


జైలు జీవితాన్ని తలచుకుంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్న ఎమ్మెల్యే నాగేంద్ర


చెల్లకెరలో వాల్మీకి చిత్రపటం ఊరేగింపు

సిరుగుప్ప: రామాయణం అన్ని కాలాల్లోనూ ఆదర్శమని తహసీల్దార్ విశ్వనాథ్ పేర్కొన్నారు. పట్టణంలో తాలూకా పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఇతర ప్రతినిధులు, అధికారులతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. చిత్రదుర్గానికి చెందిన అధ్యాపకుడు డా.జె.కరియప్ప మాళిగ వాల్మీకి గురించి ప్రధానోపన్యాసం చేశారు. అంతకు ముందు క్రీడా మైదానం నుంచి వాల్మీకి ఇతర మహనీయుల చిత్రపటాల ఊరేగింపును మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప ప్రారంభించారు. నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, ఉపాధ్యక్షురాలు యశోద, నగరసభ మాజీ అధ్యక్షుడు బి.ఎం.సతీష్, వాల్మీకి మహాసభ తాలూకా అధ్యక్షుడు టి.నరసింహనాయక్, డీఎస్పీ వెంకటేశ్, సీఐ హనుమంతప్ప, నగరసభ కమిషనర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.


పూలమాల వేస్తున్న జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనాళ్లి తాయణ్ణ, తదితరులు

కంప్లి: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి జరిగింది. మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి పూజలు జరిపారు. తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, వాల్మీకి సముదాయ నాయకులు పాల్గొన్నారు.

కారటగిలో: కారటగి మండల భాజపా కార్యాలయంలో వాల్మీకి జయంతి జరిగింది. భాజపా మండల అధ్యక్షుడు మంజునాథ మస్కి, మౌనేశ్ దడేసుగూరు, వివిధ విభాగాల పార్టీ నాయకులు పాల్గొన్నారు. తహసీల్దార్, పురసభ కార్యాలయాల్లో జయంతిని నిర్వహించారు. తాలూకాలోని 28వ నంబరు కాలువ తొండిహాళ క్యాంపులో సర్వ సముదాయాల ప్రజలు తొలిసారి వాల్మీకి జయంతిని జరిపారు.

శ్రీరామనగర్: శ్రీరామనగర్‌లోని శ్రీవిద్యా నికేతన్ పాఠశాలలో జయంతి జరిగింది. విద్యా సంస్థ ఉపాధ్యక్షుడు నెక్కంటి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు జరిపారు.


ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం


వాల్మీకి విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్


హొసపేటె: జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప, డీసీ దివాకర్


సిరుగుప్పలో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు, అధికారులు


సిరుగుప్ప ఊరేగింపులో పాల్గొన్న మాజీ శాసనసభ్యుడు సోమలింగప్ప, ఇతర నాయకులు


కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


కారటగిలో వాల్మీకి జయంతిలో పాల్గొన్న భాజపా నాయకులు


శ్రీరామనగర్: శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో జయంతిలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోతి దాడిలో గాయాలు

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకాలోని మెట్రి గ్రామంలో కొండ ముచ్చుకోతి బుధవారం సాయంత్రం నాగరాజ్ అనే దివ్యాంగుడిపై దాడి చేసి గాయపర్చింది. ఆయన పొట్ట, వీపు భాగాల్లో గాయాలయ్యాయి. నాగరాజ్‌కు కంప్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. తాలూకాలోని గ్రామాల్లో ఇటీవల కోతుల దాడులు అధికమయ్యాయని ప్రజలు వాపోతున్నారు.


కోతి దాడిలో గాయపడిన నాగరాజ్

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు


మహమ్మద్ అకీఫ్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరం మిల్లర్‌పేటె ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో నివాసం ఉంటున్న మహమ్మద్ అకీఫ్(17) అనే బాలుడు అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు బళ్లారి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహమ్మద్ అకీప్ బళ్లారి నగరం శ్రీ చైత్య కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. ఈ నెల 3న కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పత్తికి మద్దతు ధర సాధనకు నేడు ఆందోళన

రాయచూరు, న్యూస్‌టుడే : పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవటానికి శుక్రవారం రాయచూరులో ఆందోళన చేపడతామని అఖిల భారత రైతు వ్యవసాయ కార్మికుల సంఘటన (ఏఐకేకేఎంఎస్) జిల్లా కార్యదర్శి మల్లనగౌడ అంచెసగూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ కూడలి వద్ద ర్యాలీ ప్రారంభించి, బసవేశ్వర కూడలి మీదుగా జిల్లా పాలనాధికారి కార్యాలయం చేరుకుంటుందని వివరించారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని పోరాటాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేపు వినియోగదారుల సమావేశం

రాయచూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారుల సమావేశాన్ని ఈ నెల 19న రాయచూరులోని జెస్కాం కార్య, పాలనా ఉప విభాగం-1 కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు జెస్కాం ఇంజినీర్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం జరుగుతుందని తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

17-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.93	1613.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	28,487	652
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	28,607	10,466
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.500	44.645

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

పశువులను నియంత్రించకపోతే చర్యలు

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పట్టణంలోని ప్రధాన రహదారి, వీధుల్లో పశువులు అధికంగా సంచరిస్తుండటంతో వాహన సంచారానికి, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. యజమానులు పశువులను వీధుల్లోంచి తీసుకెళ్లాల్సిందిగా పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. వారం రోజుల్లో పశువులను నియంత్రించకపోతే వాటిని గోశాలకు తరలిస్తామని పురసభ ముఖ్యాధికారి సురేశ్ తెలిపారు.

గణిత మేధావి ఉమ్రాణి సందడి


కార్యక్రమంలో పాల్గొన్న బసవరాజ్ శంకర్ ఉమ్రాణి (కోటు ధరించిన వ్యక్తి)

సింధనూరు, న్యూస్‌టుడే: పుట్టుకతోనే అంధత్వం ఆవరించినా.. దేవుడిచ్చిన వరంగా గణితంలో పండిపోయి.. మానవ కంప్యూటర్‌గా కీర్తి గడించిన బెళగావి జిల్లా అథణి యువకుడు బసవరాజ్ శంకర్ ఉమ్రాణి గురువారం స్థానిక ఈజే.హొసళ్లిక్యాంపులోని ఐక్యా విద్యాసంస్థలో కొద్దిసేపు సందడి చేశారు. ఎంతటి పెద్ద లెక్కనైనా సరే తీసివేత, కూడిక, గుణకారం, భాగహారం సెకన్లలో సమాధానం చెబుతూ.. విద్యార్థులను ఉర్రూతలూగించారు. గడియారం లేకుండా అప్పటికి సమయం ఎంతైందో చెప్పి ఆశ్చర్యపర్చారు. ఎవరి జన్మదినం తేదీ చెప్పినా.. అది ఏ రోజు అనే వివరాలు క్షణాల్లో చెబుతూ అందరూ అవాక్కయ్యేలా చేశారు. చివర్లో ఉమ్రాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషి జీవితం భగవంతుడు ఇచ్చిన వరం. దీనిని చక్కగా మలుచుకుని పది మంది మెచ్చుకునేలా ఆదర్శ జీవనం సాగించాలని కోరారు. ఐక్యా విద్యాసంస్థ యాజమాన్యం కొరిపెళ్ల సుగుణ, రాఘవేంద్ర, ప్రాచార్యులు రాజశేఖర్, బసవరాజ్ పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయానికి నూతన రథం


కొత్త రథానికి పూజ చేస్తున్న భక్తులు

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని సంతోషిమాత దేవస్థానానికి భక్తులు నూతన రథాన్ని సమకూర్చారు. అమ్మవారి 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉడుపి ఫలిమారుమఠం విద్యాదీశ స్వామి సాన్నిధ్యంలో రామదేవ సంస్థాన పూజ, హోమపూజ, పూర్ణాహుతి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంతోషిమాత ఆలయం చుట్టూ, పట్టణంలోని ప్రముఖ వీధుల్లో రథాన్ని ఊరేగించారు. ఆర్యవైశ్యా సంఘం తాలూకా అధ్యక్షుడు ఆర్.ముత్తురాజ్‌శెట్టి, దేవస్థాన సమితి అధ్యక్షుడు ద్యాసనూరు రాఘవేంద్రశెట్టి, కార్యదర్శి మన్సాలి వెంకయ్యశెట్టి, ఉపాధ్యక్షుడు ఆర్.శివశంకర్‌శెట్టి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంట


బెన్నూరు శివారులో వర్షానికి పడిపోయిన వరి పైరు

కారటగి, న్యూస్‌టుడే: అల్ప పీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కారటగి తాలూకా తుంగభద్ర తీరంలో వరి పంట నేల కొరిగింది. కాలువలకు నీరు రాక ముందే నది నీటిని మోటార్ల ద్వారా మళ్లించి తీర ప్రాంతంలోని బెన్నూరు, ఉళేనూరు, నందిహళ్లి, కక్కరగోళ, జమాపుర తదితర గ్రామాల రైతులు వందలాది ఎకరాల్లో వరి నాట్లు వేస్తుంటారు. దీపావళికి పంట చేతికి వస్తుంది. మరో రెండు వారాల్లో పంట కోతకు వచ్చే సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పైరు పడిపోతే వడ్ల గింజలు నేల రాలి పంట దిగుబడి తగ్గుతుంది. వర్షం మరో రెండు, మూడు రోజులు ఇలాగే ఉంటే నష్టం అధికమవుతుందని రైతులు అంటున్నారు.

సిరుగుప్పలో వాన జోరు

సిరుగుప్ప: సిరుగుప్పలో ఉరుములతో కూడిన వర్షంతో రోజంతా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఓ మోస్తరుగా వర్షం ప్రారంభమై ఉరుములతో సాయంత్రం వరకు విడతల వారీగా జోరు వర్షం పడింది. పట్టణంలోని ప్రధాన రహదారి గుంతలమయమై ద్విచక్ర వాహనాలు గుంతల్లో పడటం, కార్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు చోదకులు ఇబ్బందులు పడ్డారు. పత్తి, మిరప, జొన్న తదితర పంట పొలాలు నీటిలో మునిగి మడుగుల్లా తయారయ్యాయి.


సిరుగుప్పలో కురుస్తున్న వర్షానికి ప్రధాన రహదారి జలమయం


ఎమ్మెల్యే యత్నాళ్‌కు ‘న్యాయ’ తాఖీదులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావును, ఆయన భార్యను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌కు 42వ ఏసీఎంఎం న్యాయస్థానం జామీను రహిత వారెంటు జారీ చేసింది. ‘మంత్రి దినేశ్ గుండూరావు నివాసంలో సగం పాకిస్థాన్ ఉంది’ అని యత్నాళ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ దినేశ్ భార్య తబురావు పరువునష్టం కేసు దాఖలు చేశారు. యత్నాళ్ పలుమార్లు విచారణకు గైర్హాజరయ్యారు. బుధవారం విచారణకు గైర్హాజరు కావడంతో జామీను రహిత వారెంటు జారీ చేసి విచారణను 28వ తేదీకి వాయిదా వేశారు.

‘వాల్మీకి నిధుల దుర్వినియోగం నిజం’

బళ్లారి, న్యూస్‌టుడే: అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి నన్ను భాజపా కుతంత్ర రాజకీయంతో అరెస్టు చేసినట్లు బి.నాగేంద్ర మాట్లాడటం సరి కాదు. భాజపాపై దుష్ప్రచారం చేయడం సరికాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు నాగేంద్ర, ఆనందసింగ్, సురేష్‌బాబు, సతీష్ శైల్, అనిల్ హెచ్.లాడ్‌లను గత యూపీఏ ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఇది బి.నాగేంద్ర మరిచిపోయారా? అని ప్రశ్నించారు. ఈడీ ఛార్జిషీట్‌లో వాల్మీకి మండలి నిధులతో విమాన టికెట్లు, విలువైన కారు కొనుగోలు తదితర విషయాలు బహిర్గతం చేసింది. మండలి నిధులు వేర్వేరు బ్యాంకు ఖాతాలకు జమచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో రూ.14.80 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులను ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, గణేష్, కూడ్లిగి శాసన సభ్యుడు డా. శ్రీనివాసకు అందజేసి, ఓటుకు రూ.200 పంచినట్లు ఈడీ ఛార్జిషీట్‌లో పొందుపరిచినట్లు ఆయన ఆరోపించారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు
(హాప్‌కామ్స్- కిలో.. రూ.లలో)



బీన్స్- 135
క్యారెట్- 65
బీరకాయలు- 45
క్యాబేజీ- 25
కాలీఫ్లవర్(ఒక్కటి)- 15
సొరకాయ- 35
దొండకాయ- 30
పొట్లకాయ- 35
టమాటా(నాటు)- 65
గుమ్మడి- 35
ఆలుగడ్డ- 40
ఉల్లిగడ్డలు(మేలురకం)- 65
ఉల్లిగడ్డలు(మాములు)- 50
వెల్లుల్లి : 420
సాంబారు ఉల్లి- 120
బీట్‌రూట్- 25
వంకాయలు- 30
బెండకాయలు- 28
ముల్లంగి- 40
నిమ్మకాయలు- 270
వాషింగ్టన్ ఆపిల్ -325
సిమ్లా ఆపిల్- 145
గ్రీన్ ఆపిల్- 335
అరటి కాయలు- 55
సపోట- 45
పైనాపిల్- 35
బొప్పాయి- 40
ఆరంజ్- 70
బత్తాయి- 65

వాన ఆగింది.. పెను నష్టం కళ్లముందు కదలాడుతోంది. దేశ, విదేశీ ఐటీ సంస్థలకు పేరొందిన బెంగళూరు నగర వీధుల్లో గురువారం సంచారం ఏమంత తిన్నగా సాగలేదు. వాహనాలన్నీ కుదుపులకు లోనయ్యాయి. నడక మార్గాలు ఒడిదొడుకుల పాలయ్యాయి. మొన్నటికి మొన్న పూడ్చిన గోతులన్నీ మళ్లీ ప్రత్యక్షమై.. నరకాన్ని తలపించాయి.

రాజధాని దారులు విలవిల



రహదారుల విధ్వంసానికి పరాకాష్ఠ.. ఇలాంటి చిత్రాలు కోకొల్లలు



సాయిలేఅవుట్ నివాసులకు ఆహార పొట్లాలు అందిస్తున్న పాలికె సిబ్బంది

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వానల దెబ్బకు రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలో రహదారుల సర్వనాశనమయ్యే పరిస్థితి ఎదురవుతోంది. ఆ మార్గాల్లో వాహన సంచారం పెద్ద సమస్యగా మారింది. మొన్నటిదాకా రహదారుల్లోపడిన గుంతలను సంచార పోలీసులు మట్టి వేసి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించినా.. ఇప్పుడు మొదటికొచ్చాయి. వారం రోజులుగా దారులన్నీ బురద మయం కావడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సర్జాపుర, బెళ్లందూరు, యలహంక, కె.ఆర్.పురం, టిన్‌ఫ్యాక్టరీ, బెన్నిగానహళ్లి, రింగ్‌రోడ్డు, రామమూర్తినగర, టీసీ పాళ్య, వడ్డెరపాళ్య తదితర ప్రాంతాల్లోని రహదారులు పూర్తిగా పాడైనట్లు పాలికె అధికారులు గుర్తించారు. కురిసిన వర్షాలకు 350 కిలోమీటర్ల రహదారులు పాడైనట్లు ప్రాథమికంగా తేలింది. వాటిపై మూడువేల గుంతలు పడినట్లు అంచనా వేస్తున్నారు. వాటిని పూడ్చేందుకు పాలికె ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. వర్షం కురిసే సమయంలో గుంతలు పూడ్చటం సాధ్యం కాదని పాలికె వర్గాలు స్పష్టం చేశాయి.

నిండామునిగిన శివారుకాలనీ..

రాజధాని నగరంలో ఈసారి వర్షాలకు బాగా నష్టపోయిన కృష్ణరాజపురం సమీప సాయిలేఅవుట్ నివాసులకు సాయం చేయడానికి బెంగళూరు పాలికె అధికారులు ముందుకొచ్చారు. అక్కడి బాధితులకు బుధవారం రాత్రి భోజనం, తాగునీటిని సమకూర్చారు. గురువారం ఉదయం అల్పాహారం, తాగునీటి సీసాలను ఇంటింటికీ చేరవేశారు. ఏడు నెలల కిందట ఇదే కాలనీలో కురిసిన వర్షానికి ఇళ్లన్నీ ముంపు పాలయ్యాయి. ఈసారీ అవే ఇక్కట్లు ఎదురయ్యాయి. అక్కడ స్తంభించిన నీటి మడుగులను గురువారం ఉదయం నుంచి అగ్నిమాపక సిబ్బంది, యంత్రాల సాయంతో బయటకు తరలిస్తున్నారు. కొంత నీటి మట్టం తగ్గినా బురద మేటవేసినట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు శ్రమిస్తున్నారు. ఇక్కడి అనేక నివాసాలను ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి వెళుతున్నారు. కొందరైతే విక్రయానికి పెడుతున్నారు. బాధలను తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రాలేదని బాధితులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.



అడుగడుగునా గుంతలు పడిన సర్జాపుర రహదారి

సిద్ధుతో నాగేంద్ర చర్చలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను మాజీ మంత్రి నాగేంద్ర గురువారం బెంగళూరులో సత్కరించారు. వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణపై ఈడీ అధికారులు నాగేంద్రను అరెస్టు చేసి రెండునెలలు కారాగారంలో ఉంచిన విషయం తెలిసిందే. ఆయన బుధవారం విడుదలయ్యారు.. తాజాగా ముఖ్యమంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. నిధుల కుంభకోణంలో సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్లను ప్రస్తావించాలని ఈడీ అధికారులు తనపై ఒత్తిడి తెచ్చారని నాగేంద్ర ఆరోపించారు. ఈ వివరాలన్నీ సిద్ధుతో చర్చించారు.

కాంగ్రెస్ గెలుపు తథ్యం

బళ్లారి: ఎమ్మెల్యే, మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి సండూరులో ఇల్లు కాదు..ప్యాలెస్ కట్టినా ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు తథ్యం(పక్కా) అని గ్రామీణ శాసనసభ్యుడు బి.నాగేంద్ర ధీమా వ్యక్తం చేశారు. గురువారం తన నివాసం వద్ద కలిసిన విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి సముదాయంలో పుట్టిన తాను వాల్మీకి మండలిలో జరిగిన అక్రమాలపై మాట్లాడటానికి మనసు రావడం లేదు. మనసును రాయి చేసుకుని మాట్లాడుతున్నాను. నేను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు. భాజపా కుతంత్ర రాజకీయంతో సీబీఐ, ఈడీని ఉపయోగించి ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. మొదట నన్ను లక్ష్యం చేసుకుని కేసుపై జైలుకు పంపారు. త్వరలో నిజానిజాలు బయటకు వస్తాయన్నారు. భాజపా భయంతో తన పార్టీని విలీనం చేశారు. ఈడీ, సీబీఐకి రెడ్డి భయపడి భాజపాలో చేరారు. కేఆర్‌పీపీ స్థాపించిన సందర్భంలో రెడ్డి భాజపాను ఎలా విమర్శించారో రాష్ట్ర ప్రజలకు తెలుసు..యూపీఏ ప్రభుత్వంలో జైలుకు పంపినట్లు ఆరోపణలు చేయడంపై రెడ్డి ఆలోచించాలి. భాజపా, రెడ్డి జతలో ఉంటే తమకు మంచి వాళ్లమా? ఇప్పుడు పార్టీ మారితే నాగేంద్ర అక్రమాలకు పాల్పడినట్లు అయినందుకు కొద్దిగా ఆత్మ ఉంటే ఆలోచన చేసి మాట్లాడాలి. అంటూ చురకలంటించారు. గాలి జనార్దన్‌రెడ్డి బళ్లారికి వస్తే తమ పార్టీపై ఎలాంటి ప్రభావం ఉండదు.సండూరు ఉప ఎన్నికల్లో గెలుపు పొందేది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థే.. దీనిపై ఎలాంటి అనుమానం లేదన్నారు. గాలి జనార్దన్‌రెడ్డి కాదు. ఎవరు వచ్చినా సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కచ్చితమన్నారు.



సిద్ధరామయ్యను సత్కరిస్తున్న మాజీ మంత్రి నాగేంద్ర

రోడ్డుప్రమాదంలో సోదరుల మృతి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాజధాని పరిధి దేవీనగరలో బుధవారం అర్ధరాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. నాగరబావి నివాసి రాజేశ్ కుమార్ (27), దొడ్డబొమ్మసంద్ర నివాసి నాగరాజు (30)లను మృతులుగా గుర్తించారు. వరుసకు వీరిద్దరూ అన్నదమ్ములు. శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనంలో వెళుతున్న సమయంలో వాహనం అదుపు తప్పి రహదారి విభజకాన్ని ఢీకొట్టారు. తలకు తీవ్రంగా గాయాలైన వీరిని బాప్టిస్టు ఆసుపత్రికి తరలించేలోగా మార్గమధ్యంలో మరణించారు. వీరి వద్ద మారణాయుధాలు ఉండడంతో దారి దోపిడీలకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానించారు.. ఇప్పటి వరకు వీరిపై ఒక్క కేసు కూడా లేదని హెబ్బాళ ట్రాఫిక్ ఠాణా పోలీసులు స్పష్టం చేశారు.

బెంగళూరు లాడ్జ్‌లో తహసీల్దార్ కన్నుమూత

శివమొగ్గ, న్యూస్‌టుడే : తీర్థహళ్లి తహసీల్దార్ జీబీ జక్కనగౌడర్ (54) బెంగళూరు ఉప్పారపేటలోని ఒక లాడ్జ్‌లో మరణించారని గుర్తించారు. కోర్టు పనిపై నగరానికి వచ్చి లాడ్జ్‌లో ఉన్నారు. మంగళవారం రాత్రి నుంచి ఆయన ఫోన్‌కాల్‌కు స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గదిలోనే జక్కనగౌడర్ మృతదేహం ఉందని గురువారం గుర్తించారు. గుండెపోటుతో మరణించారని పోలీసులు అనుమానిస్తున్నారు. తీర్థహళ్లిలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

యువ ఛాయాచిత్ర విన్యాస లహరి!



హాంగ్‌కాంగ్‌కు చెందిన దయానా చాంగ్ తీసిన ఫొటో.. పండ్ల కోసం పిట్టల పోరు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : దేశ, విదేశాలకు చెందిన ఛాయాచిత్రగ్రాహకులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్నామని యూత్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ కార్యనిర్వాహక సమితి అధ్యక్షుడు మంజు వికాశ్ శాస్త్రి వెల్లడించారు. ఈ ఏడాది పోటీలకు 38 దేశాల నుంచి 257 మంది ఫొటోగ్రాఫర్లు తాము తీసిన 3227 ఫొటోలను పంపించారని చెప్పారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిది మంది విదేశీ, నలుగురు భారతీయ న్యాయనిర్ణేతలు కలర్, హెరిటేజ్ ఆఫ్ ది వరల్డ్, మోనోక్రోమ్, నేచర్ విభాగాల్లో ఉత్తమ ఛాయాచిత్రాలు తీసిన విజేతలను ఎంపిక చేశారని తెలిపారు. హాంగ్‌కాంగ్‌కు చెందిన దయానాచాన్, అరుణ్ ప్రకాశ్, ఇన్ లే వాన్, సుబ్రత బైసాక్ నాలుగు విభాగాల్లో బంగారు పతక విజేతలుగా నిలిచారని తెలిపారు. వివిధ విభాగాల్లో నవీన మోహన్, హెచ్.సతీశ్, రాజశేఖర్, జయేశ్, ప్రసాద్ మంత్రి తదితరులు ఆయా విభాగాలలో విజేతలుగా నిలిచారని తెలిపారు. ఒక్కో విభాగంలో ఆరుగురు చొప్పున మొత్తం 24 మందికి పతకాలు, ప్రశంసాపత్రాలు, బహుమతులు ఇస్తామన్నారు. వీరితో పాటు ఈ ఏడాది ఒక క్లబ్‌కు, ముగ్గురు విదేశీయులు, బెంగళూరుకు చెందిన సుబ్రత కరకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తున్నామని వివరించారు. విజేతలు, ఇతర అత్యుత్తమ చిత్రాలను చిత్రకళా పరిషత్తులో శని, ఆదివారాల్లో ప్రదర్శిస్తామని చెప్పారు.



బెంగళూరు ఫొటోగ్రాఫర్ సతీశ్ తీసిన ఛాయాచిత్రం.. సాస్ తయారీ దినుసులతో వ్యాపారి



అడవిపంది పిల్లను నోటకరచుకుని వెళుతున్న సింహం

కారాగారం నుంచే హనీట్రాప్‌కు ప్రణాళిక

కలబురగి, న్యూస్‌టుడే : కారాగారంలో ఖైదీలు గంజాయి, చరవాణి వినియోగిస్తున్న ఆరోపణలపై అధికారులు సోదా చేస్తూ ఉంటారు. బెంగళూరు మల్లేశ్వరంలో పేలుడు ఘటనలో నిందితుడు, అనుమానిత తీవ్రవాది జుల్ఫిక్, శివమొగ్గకు చెందిన రౌడీషీటర్ బచ్చన్ ఇద్దరూ కలబురగి కేంద్ర కారాగారంలో ఒకే బ్యారక్‌లో ఉండేవారు. వీరిద్దరూ కారాగారం నుంచే శ్రీమంతులకు ఫోన్లు చేసి మీ నగ్న చిత్రాలు ఉన్నాయని, కొందరు యువతులతో నగ్నంగా మారి ఫోను చేశారని బెదిరించి, తమ ఖాతాలకు నగదు వేయించుకునేవారు. కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న సాగర్ అనే ఖైదీని ఇలాగే బెదిరించారు. తమకు పరిచయం ఉన్న ఒక యువతితో సాగర్ నగ్నంగా మారి మాట్లాడేలా చేశారు. అనంతరం ఆ వీడియో పెట్టుకుని మీ కుటుంబ సభ్యులకు చెప్పి తమ ఖాతాలో నగదు వేయించాలని బెదిరించారు. సాగర్ ఫిర్యాదుతో నిందితుల నుంచి సెల్‌ఫోన్ జప్తు చేసుకున్నారు. వారిద్దరినీ వేర్వేరు బ్యారక్‌లకు తరలించి మరో విచారణ చేపట్టారు.

విద్యుదాఘాతంతో నేలకొరిగిన ఏనుగు

హాసన, న్యూస్‌టుడే: ఆహారం కోసం సకలేశపుర తాలూకా బనవాసె గ్రామంలోని ఆకాశవాణి టవర్ వద్దకు వచ్చిన మగ ఏనుగు ఒకటి విద్యుదాఘాతంతో మరణించింది. ఈ ఏనుగుకు పాతిక ఏళ్ల వయసు ఉంటుందని అంచనా వేశారు. టవర్ వద్ద తెగిపడిన విద్యుత్తు తీగ తగలడంతో ప్రమాదం సంభవించింది. హాసన విభాగం అటవీశాఖ సిబ్బంది ఏనుగు మృతదేహానికి మరణోత్తర పరీక్ష నిర్వహించి, గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

గృహిణి విషాదాంతం

బెళగావి, న్యూస్‌టుడే : బైలహొంగల తాలూకా హొసూరు గ్రామంలో స్నానానికి వేడి నీరు కాచేందుకు పెట్టిన హీటర్ కాయిల్‌ను పొరపాటున పట్టుకున్న రేఖ (36) అనే గృహిణి విద్యుదాఘాతంతో మరణించింది. ఆమె కుటుంబ సభ్యులు గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆమె మృతి చెందింది. మురగోడ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉరివేసుకుని కడతేరిన ఖైదీ

బెళగావి, న్యూస్‌టుడే: హిండలగ కారాగారంలోని తన గదిలో బుధవారం ఉరి వేసుకున్న గిరీశ్ అనే ఖైదీని సహ ఖైదీలు కిందకు దించారు. అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను బుధవారం రాత్రి మరణించాడు. మృతుడు బళ్లారికి చెందిన వాడు. బెళగావి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అయ్యో.. పాపం!

> చదువంటే ప్రాణం ఆ బాలుడికి.. చక్కగా చదివి గొప్పవాడు కావాలనే పట్టుదలతో క్రమం తప్పకుండా బడికెళ్లేవాడు. నవోదయ పరీక్ష రాసి ఎలాగైనా ఉత్తీర్ణుడవ్వాలని రోజూ శిక్షణ పొందుతున్నాడు. కుక్కల రూపంలో వచ్చిన మృత్యువు అమాంతం అతన్ని కబళించింది. ట్యూషన్ కెళ్లొస్తా నాన్నా అంటూ టాటా చెప్పి వెళ్లిన కొడుకు శవమై కన్పిస్తాడని ఊహించని కుటుంబ సభ్యులు గుండెలు బాదుకున్నారు. ఆశ తీరకనే అసువులు బాశావా అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. కుక్కల దాడిలో మృతిచెందిన హృదయవిదారక ఘటన మొళకాల్మూరు తాలూకాలో జరిగింది.

వీధి కుక్కల దాడిలో బాలుడి మృతి

చెళ్లకెర(చిత్రదుర్గ), న్యూస్‌టుడే: వీధి కుక్కల దాడిలో మిథున్ (10) అనే బాలుడు మృతి చెందిన సంఘటన మొళకాల్మూరు తాలూకా రాంపురం గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాంపురం గ్రామానికి చెందిన చన్నమల్లికార్జున కుమారుడు మిథున్ అదే గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. మొరార్జీ దేశాయి, నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్ష రాసేందుకు శిక్షణ పొందడానికి ఉపాధ్యాయుడి వద్ద ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి వెళ్తుండగా వీధి కుక్కలు అతన్ని చుట్టుముట్టాయి. దీంతో భయపడి పరుగెత్తుతూ అదుపు తప్పి నేలపై పడిపోవడంతో అతన్ని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. బాలుడు రక్త గాయాలతో కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న చోదకుడు గమనించి వీధి కుక్కలను తరిమి వేసి బాలుణ్ని రక్షించారు. బాలుడి పరిస్థితి విషమించడంతో అతన్ని గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స అందించి, అతని తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం వెంటనే బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రాంపురం ఠాణాలో కేసును నమోదు చేసుకొని విచారిస్తున్నారు. కొద్దినెలల క్రితం మేదేహళ్లి గ్రామంలోనూ వీధి కుక్కల దాడిలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే.



మిథున్ (పాతచిత్రం)

నృత్య చంద్రోదయానికి వేదిక సిద్ధం



నృత్యవిదుషి సరితా మిత్రా



అపర్ణా మీనన్ బృంద నాట్య విలాసం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ఉద్యాన నగరి బెంగళూరులో ఒడిస్సా నృత్య సంస్థ ఈనెల 19న శరద్ చంద్ర-2024 పేరిట మహా నృత్యోత్సవానికి ఏర్పాట్లు చేస్తోంది. జయనగర్‌లోని జగద్గురు శివరాత్రి దేశికేంద్ర స్వామి (జేఎస్ఎస్) కళాశాల ప్రాంగణంలో ఆ రోజు సాయంత్రం నిర్వహించే వేడుకకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు ఎలిజబెత్ ఏరియన్, కర్ణాటక సంగీత నృత్య అకాడమీ అధ్యక్షురాలు గురు శుభా ధనంజయ్, కర్ణాటక కళాశ్రీ సత్యనారాయణరాజు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అద్భుత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సరితా మిత్రా, ఒడిస్సీలో పేరొందిన సంగీతా చటర్జీ కథక్ విన్యాసం, అపర్ణ మీనన్ బృందం ప్రదర్శనలు ఆకట్టుకోనున్నాయి.

అప్పుల బాధతోనే.. కానరాని లోకాలకు..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బెంగళూరు శివారు యలహంక పరిధి సింగనాయకనహళ్లి వద్ద యూరప్స్ లేఅవుట్‌లో క్యాబ్ డ్రైవరు అవినాశ్(33), అతని భార్య మమత (30), ఇద్దరు పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు. వారం రోజుల కిందట వారు విగతజీవులుగా మారిన విషయం తెలిసిందే. కలబురగి నుంచి నగరానికి వచ్చిన అవినాశ్ క్యాబ్ డ్రైవరుగా, మమత ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసేవారు. వారికి అధీయ (5) అనే కుమారుడు, అనయ (3) అనే కుమార్తె ఉన్నారు. బిడ్డలకు మంచి భవిష్యత్తు కల్పించాలని అవినాశ్ కోరుకునేవాడు. ఇదే క్రమంలో ఒక క్రెడిట్ కార్డు తీసుకున్నాడు. ఒకదాని అనంతరం మరోటి చొప్పున కార్డుల సంఖ్యను పెంచుకుంటూ వెళ్లాడు. అప్పు ఎలాగైనా తీర్చవచ్చని భావించి. . చివరికి విఫలమయ్యాడు. ఆ కార్డులను వెనక్కు ఇచ్చి, అప్పులను తీర్చేద్దామన్నా వినకపోవడంతో తన ఇద్దరు బిడ్డలకు విషాహారం పెట్టి, తాను కూడా తిని మమత ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన అనంతరం జరిగిన ఘటనను చూసి ఆవేదనతో మృతదేహాలకు ఉరి తాళ్లు కట్టి వేలాడదీసి, తానూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని రాజానుకుంటె ఠాణా పోలీసులు గుర్తించారు.



అవినాశ్, మమత, ఇద్దరు పిల్లలు

గణిత మేధావి ఉమ్రాణి సందడి

సింధనూరు, న్యూస్‌టుడే: పుట్టుకతోనే అంధత్వం ఆవరించినా.. దేవుడిచ్చిన వరంగా గణితంలో పండిపోయి.. మానవ కంప్యూటర్ కీర్తి గడించిన బెళగాం జిల్లా అథణి యువకుడు బసవరాజ్ శంకర్ ఉమ్రాణి గురువారం స్థానిక ఈజే. హొసళ్లిక్యాంపులోని ఐక్యా విద్యాసంస్థలో సందడి చేశారు. ఎంతటి పెద్ద లెక్కనైనా సరే తీసివేత, కూడిక, గుణకారం, భాగహారం సెకన్లలో సమాధానం చెబుతూ..విద్యార్థులను ఉర్రూతలూగించారు. గడియారం లేకుండా అప్పటికి సమయం ఎంతైందో చెప్పి ఆశ్చర్యపర్చారు. ఎవరి జన్మదినం తేదీ చెప్పినా..అది ఏ రోజు అనే వివరాలు క్షణాల్లో చెబుతూ అందరూ అవాక్కయ్యేలా చేశారు. చివర్లో ఉమ్రాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషి జీవితం భగవంతుడు ఇచ్చిన వరం. దీనిని చక్కగా మలుచుకుని పది మంది మెచ్చుకునేలా ఆదర్శ జీవనం సాగించాలని కోరారు. ఐక్యా విద్యాసంస్థ యాజమాన్యం కొరిపెళ్ల సుగుణ, రాఘవేంద్ర, ప్రాచార్యులు రాజశేఖర్, బసవరాజ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బసవరాజ్ శంకర్ ఉమ్రాణి (కోటు ధరించిన వ్యక్తి)

అన్నమయ్య జిల్లావాసి హత్య

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజుకు చెందిన బాలాజీ (24) అనే యువకుడు బెంగళూరులో హత్యకు గురయ్యాడు. మృతుని తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. బాలాజీ ఏడాది కిదంట బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తు అద్దె గదిలో ఉంటున్నాడు. రామసముద్రం మండలానికి చెందిన రెడ్డెప్పరెడ్డి బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తు ఆవులహల్లిలో కాపురం ఉన్నాడు. వారిద్దరికీ పరిచయం ఏర్పడింది. ఆదివారం నుంచి బాలాజీ చరవాణి మోగుతున్నా తియ్యక పోవడం, గదిలో కనిపించక పోవడంతో తల్లిదండ్రులు బెంగళూరు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు బాలాజీ మృతిచెందిన ప్రాంతాన్ని గుర్తించారు. మృతదేహం ఉబ్బిపోయి ఉండడం చూస్తే హత్య జరిగి మూడురోజులై ఉండవచ్చని పోలీసులు గుర్తించారు. బాలాజీ ఈ నెల 13వతేదీ తన గది నుంచి స్నేహితుడు రెడ్డెప్పరెడ్డి పిలుపుమేరకు అక్కడకు వెళ్లాడని, ఇద్దరూ మద్యం తాగారని సమాచారం. ఆ సమయంలోనే బాలాజీని నరికి చంపినట్లు గుర్తించారు.

ఆధునిక సాంకేతికతతో వైద్యం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : దేశంలో ఆధునిక సాంకేతికతతో పని చేసే మొదటి త్రీడీ ప్రింటింగ్ ల్యాబ్‌ను స్పర్శ్ ఆసుపత్రి సిద్ధం చేసుకుంది. రోబోటిక్ విధానంలో శస్త్రచికిత్స చేసే సమయంలో త్రీడీ ప్రింటింగ్‌తో సృష్టించే అవయవ నమూనాలు వైద్యులకు ఉపయుక్తంగా ఉంటాయి. ఎముకల (ఆర్థోపెడిక్) సమస్యతో వచ్చే రోగులకు శస్త్రచికిత్సలు చేసే సమయంలో ఈ ప్రయోగశాల సేవలు వినియోగించుకుంటామని స్పర్శ్ గ్రూపు ఆసుపత్రుల అధ్యక్షుడు డాక్టర్ శరణ్ శివరాజ్ పాటిల్ తెలిపారు. ప్రయోగశాలను ఆయన గురువారం ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. త్రీడీ ప్రింటింగ్‌తో కృత్రిమ అవయవాలను సృష్టించేందుకు, కచ్చితత్వంతో, వేగంగా శస్త్రచికిత్సలను పూర్తి చేయవచ్చని వివరించారు. రోబోటిక్, త్రీడీ ప్రింటింగ్‌లను వినియోగించుకుని నిర్వహిస్తున్న శస్త్రచికిత్సలు 99.99 శాతం విజయవంతం అవుతాయని తాము ఇప్పటికే నిర్వహించిన ప్రయోగాత్మకంగా గుర్తించామని తెలిపారు.



త్రీడీ ప్రింటర్‌తో చేసిన అవయవాలను చూపిస్తున్న ...

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

అలరించిన సంగీత కృతులు



సంగీత కృతులు ఆలపిస్తున్న మహిళలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : శేషాద్రిపురం ప్లాట్‌ఫారమ్ రోడ్డులోని నంజన్‌గూడు రాఘవేంద్రస్వామి మఠంలో స్వామీజీ చాతుర్మాసవ్రత సందర్భంగా సంగీతం, భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హయవనోపనిషత్ ప్రసారణ ప్రతిష్ఠాన సంస్థకు చెందిన గోపాలకృష్ణ దర్శకత్వంలో భావిసమీర వాదిరాజస్వామి రచించిన 108 కృతులను అలకనంద భజన సంస్థకు చెందిన మహిళలు ఆలపించి సభికులను తన్మయులను గావించారు. గాయనీమణులను నిర్వాహకులు అభినందించి సత్కరించారు.

హసనాంబ జాతరకు ఆహ్వానం



సిద్ధరామయ్యను ఆహ్వానిస్తున్న ఎంపీ శ్రేయస్‌పటేల్, ఎమ్మెల్యే శివలింగేగౌడ, జిల్లాధికారి సత్యభామ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : హసన్‌లోని హసనాంబ జాతర ఈనెల 24 నుంచి ప్రారంభమవుతుండగా.. జాతరకు హాజరు కావాలని హసన్ ఎంపీ శ్రేయస్ పటేల్, శాసనసభ్యుడు శివలింగేగౌడ, జిల్లాధికారి సత్యభామ తదితరులు గురువారం ఇక్కడ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసి ఆహ్వానించారు. హసనాంభ జాతర ఉత్సవాలు నవంబరు 3వ తేదీ వరకు కొనసాగుతాయి. ఉత్సవాల్లో పాల్గొన్నడంతో పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలకు ముఖ్యమంత్రులు హాజరు కావడం అనవాయితీగా వస్తోంది.

హోసూరు కబుర్లు

ఏఐఏడీఎంకే కార్యకర్తల సంబరాలు

హోసూరు, న్యూస్‌టుడే : ప్రజానాయకుడిగా ఖ్యాతి పొందిన ఎం.జి.రామచంద్రన్ ఏఐఏడీఎంకే పార్టీ స్థాపించి 53 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు గురువారం హోసూరులో సంబరాలు చేసుకున్నారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి ప్రజలకు భోజనం, దుస్తులు పంపిణీ చేశారు. రాయకోట రోడ్డులో ఎం.జి.ఆర్ విగ్రహానికి మాజీ మంత్రి పి.బాలకృష్ణ రెడ్డి నేతృత్వంలో పూల మాల వేశారు. జూజువాడి కార్పొరేటర్ అశోక పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతినిధులు ఎస్.నారాయణ్, చిట్టి జగదీష్, కార్పొరేటర్లు రాజీ, నందకుమార్, జయప్రకాష్, బేడరపల్లి గోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మత్తిగిరిలో ఎం.జి.ఆర్. చిత్రపటాలను అలంకరించి పార్టీ పతాకాన్ని ఎగిరవేశారు. కార్యక్రమంలో వాసుదేవన్, జె.సురేష్, రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎం.జి.ఆర్.విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



మత్తిగిరిలో పాల్గొన్న పార్టీ ప్రముఖులు

పారిశ్రామికవాడ రోడ్డులో చెత్త దిబ్బలు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధిలో పరిశ్రమలు, ఆసుపత్రులు, హోటళ్లు, మాంసం దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలు, చెత్తను రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు. కార్పొరేషన్ కార్మికులు సకాలంలో తొలగించకపోతే నివాసులు, కార్మికులు ఇబ్బందులు పడుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. పారిశ్రామికవాడలోని ఆలయానికి వెళ్లే దారిలో చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో ప్రజలు ముక్కు మూసుకొని నడవాల్సి వస్తోంది. మేయర్, కమిషనర్ వార్డులను సందర్శించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తోపమ్మ ఆలయం సమీపంలో చెత్త మూటలు

ఐదుగురికి బహుమతుల ప్రదానం

హోసూరు, న్యూస్‌టుడే : ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన పథకం ప్రారంభించి ఆరేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ పథకం ద్వారా చికిత్సలు పొందిన ఐదుగురికి కలెక్టర్ సరయు బహుమతులు అందజేశారు. నలుగురు సమన్వయకర్తలు, ఇద్దరు వార్డు ఇన్‌చార్జ్‌లకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ పథకం కింద 1519 మంది రోగులకు మందులు, శస్త్ర చికిత్సలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 11 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. కృష్ణగిరి జిల్లాలో 7 ప్రభుత్వ ఆసుపత్రులు, 27 ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. 4,45,021 మందికి బీమా గుర్తింపు కార్డులు పంపిణీ చేశారన్నారు. 57,591 మంది రోగులకు రూ.89.49 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ ధర్మ, ముఖ్యమంత్రి బీమా పథకం అధికారి రాజేష్, అధికారులు పాల్గొన్నారు.



మహిళకు బహుమతి అందిస్తున్న కలెక్టర్ సరయు, అధికారులు



వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసిన సిద్ధరామయ్య, రాజణ్ణ తదితరులు



చిత్రదుర్గం : వాల్మీకి చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న మంత్రి సుధాకర్, తదితరులు



వాల్మీకి చిత్రపటానికి పుష్పార్చన చేసిన మంత్రి పరమేశ్వర్, జ్యోతిగణేష్, శుభాకల్యాణ్, అశ్విజ



పావగడ : వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

రామరాజ్య స్థాపనే లక్ష్యం

బెంగళూరు (యశ్వంతపుర) : వెనుకబడిన వర్గాలకు చెందిన మహర్షి వాల్మీకి సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం శాసనసభ్యుల నివాస భవనాల ఆవరణ ఉద్యానవనంలో ఉన్న వాల్మీకి విగ్రహానికి ఆయన పూలమాల వేసి వాల్మీకి జ్యోతిని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని సంస్కృతంలో రాసి, మనువాదులను దెబ్బ తీశారని తెలిపారు. అన్నివర్గాల సమానతతో కూడిన రామ రాజ్యం కోసం తమ ప్రభుత్వం శ్రమిస్తుందన్నారు. మంత్రి కె.ఎన్.రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలకు పెద్ద పీట

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి రచించిన రామాయణంలో మానవతా విలువలకు పెద్దపీట వేశారని, పలు అంశాలు మానవాళి మనుగడకు ఉపకరిస్తున్నాయని జిల్లా బాధ్యమంత్రి డి.సుధాకర్ అభిప్రాయపడ్డారు. వాల్మీకి జయంతి సందర్భంగా రంగమందిరంలో వాల్మీకి చిత్రపటానికి పుష్పార్చన చేసి మాట్లాడారు. దుష్టశక్తులపై విజయ సాధనకు రామాయణం ఉదాహరణ అని, మహర్షులను ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో సాధన చేసిన దినేశ్ గౌడగెరె, తిప్పేస్వామి, హనుమంతప్ప, సిరివల్లభలను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరేంద్ర, నగర సభ అధ్యక్షురాలు సుమిత, కమిషనర్ రేణుక, అదనపు పాలనాధికారి కుమారస్వామి, ఏసీ కార్తీక్, అదనపు ఎస్పీ కుమారస్వామి, నాయక సామాజికవర్గం అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. పూలపల్లకిపై వాల్మీకి విగ్రహాన్ని కోట ముఖద్వారం నుంచీ పట్టణ వీధుల్లో ఊరేగించారు.



చిక్కబళ్లాపుర : చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న నాయకులు

పావగడ, న్యూస్‌టుడే : ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక కుమారస్వామి కాలనీలోని వాల్మీకి దేవాలయంలో అధికారులు, వాల్మీకి సముదాయ నాయకులు వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి భావ చిత్రానికి నివాళులర్పించారు. వాల్మీకి నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచేలా రచించిన రామాయణాన్ని స్మరించుకొని మహర్షిని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఎన్.వరదరాజు, ఈవో జానకిరామ్, పురసభ అధ్యక్షుడు రాజేష్, ప్రిన్సిపల్ మారెప్ప, పాలేగార్ లోకేష్, ఎస్ఐ గురునాథ్, అధికారులు, సంఘ సంస్థల నాయకులు, వాల్మీకి సముదాయ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.





తుమకూరు : విద్యార్థులను సత్కరిస్తున్న నేతలు, వాల్మీకి పటానికి పూలు వేస్తున్న జయదేవ్, లతాకుందరిగి తదితరులు

ఎస్టీ సంక్షేమానికి రూ.11,447 కోట్లు

తుమకూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ బడ్జెట్‌లో ఎస్టీ సంక్షేమానికి రూ.11,447 కోట్లను రిజర్వుగా ఉంచినట్లు హోంమంత్రి జిల్లా జి.పరమేశ్వర్ తెలిపారు. నగరంలోని బాలభవనం సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి జయంతిని మంత్రి ప్రారంభించారు. వాల్మీకి చిత్రపటానికి పుష్పార్చన చేసి మాట్లాడారు. ఎస్టీ విద్యార్థులు విదేశాల్లో విద్యాభ్యాసం కోసం ప్రబుద్ధ పథకాన్ని అమలు చేసినట్లు తెలిపారు. తుమకూరు విశ్వవిద్యాలయంలో వాల్మీకి అధ్యయన పీఠం స్థాపించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వాల్మీకి మహర్షి ఆదర్శాలను పాటించాలని, ఆచంద్రార్కం ఆయన చిరస్థాయిగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్, జిల్లాధికారి శుభాకల్యాణ్, సీఈఓ ప్రభు, ఎస్పీ అశోక్, పాలికె కమీషనర్ అశ్విజ, జిల్లా నాయక మహిళా సముదాయం అధ్యక్షురాలు శాంతలా రాజణ్ణ, ఎస్టీ సముదాయం ప్రతినిధులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

భారత ఆదికవి వాల్మీకి

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : భారత ఆదికవి వాల్మీకి జయంతిని జాతీయ దినాచరణగా ఆచరించడం, ఆయనకు ఇచ్చిన గౌరవమని దాసరహళ్లి క్షేత్రం కన్నడ జానపద పరిషత్ అధ్యక్షుడు వై.బి.హెచ్.జయదేవ్ తెలిపారు. గురువారం హావనూరు లేఔట్ భూమికా సేవా ఫౌండేషన్‌లో ఆదికవి వాల్మీకి చిత్రపటానికి పూలు సమర్పించారు. 24 వేల సంస్కృత శ్లోకాలతో రామాయణాన్ని రచించిన గొప్ప మహాకవి వాల్మీకి అన్నారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు లతాకుందరిగి, కన్నడ సేనా కోశాధికారి రాజేంద్రకొణ్ణూర, సలహా సమితి సభ్యుడు రమేష్‌జమఖండి, పదాధికారులు బామాసదాశివయ్య, కవయిత్రి గీతా వి.ఆర్.వెంకటేష్, భూమిక పాల్గొన్నారు.

చిక్కబళ్లాపుర : జిల్లా కేంద్రంలో మహర్షి వాల్మీకి భవన నిర్మాణానికి స్థలాన్ని గుర్తించామని జిల్లా వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. భవంతి నిర్మాణం, సముదాయ భవనం, ఇతర అభివృద్ధి పనులకు త్వరలో రూ.4 కోట్ల నిధులు మంజూరు అవుతాయని చెప్పారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని, వివిధ రంగాల్లో సాధనలను చేసిన వారిని ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, జిల్లాధికారి రవీంద్ర, ఇతర అధికారులతో కలిసి సత్కరించారు. పది, పీయూలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విద్యార్థులు, బోవి సంఘాల ప్రతినిధులు నగరంలో జాతా నిర్వహించారు.

కోలారు : వాల్మీకి జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఆచరించారు. ఎస్పీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో వాల్మీకి చిత్రపటాలకు పుష్పార్చనలు చేశారు. దేవరాయసముద్రంలో పంచాయతీ ఉపాధ్యక్షుడు జమ్మనహళ్లి కృష్ణ, కేజీఎఫ్ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శాంతరాజు, ముళబాగిలులో దళిత నాయకుడు ఎస్.విజయకుమార్, అధికారి డీఆర్ సర్వేష్, కేవీ సుబ్రహ్మణి, సి.సుబ్రహ్మణ్యం వేడుకల్లో పాల్గొన్నారు.



కేజీఎఫ్ ఠాణాలో వాల్మీకి చిత్రపటం వద్ద అధికారులు

బ్యాంక్ సిబ్బందితో ఇబ్బంది

రామనగర, న్యూస్‌టుడే : కనకపురలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సిబ్బందికి కన్నడ రాకపోవడంతో ఖాతాదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఖాతాదారులే ఎక్కువగా ఉండడం, వారికి హిందీ రాకపోవడంతో లావాదేవీలు చేయడం సమస్యగా పరిణమించింది. మేనేజర్ నుంచి క్యాషియర్ వరకు అందరూ ఉత్తరాదికి చెందిన సిబ్బందే కావడంతో కొందరు ఖాతాదారులు సిబ్బందితో నిత్యం గొడవకు దిగుతున్నారు. బ్యాంక్ సిబ్బంది ప్రవర్తను ఖండిస్తూ దేవరాజ్ అనే కన్నడాభిమాని ఎక్స్ కార్ప్‌లో పోస్టు చేసిన వీడియో వైరల్‌గా మారింది.

నిందితులకు బెయిలు

దావణగెరె, న్యూస్‌టుడే : వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళుతున్న సమయంలో రాళ్లతో దాడి చేసి, విధ్వంసానికి పాల్పడి కారాగారంలో చేరిన 48 మంది నిందితులకు న్యాయస్థానం బెయిలు మంజూరు చేసింది. సెప్టెంబరు 19న నూరానీ ఆటో స్టాండ్ వద్ద జరిగిన ఘటనలో రఘు అనే కానిస్టేబుల్‌తో పాటు పలువురు స్థానికులు గాయపడ్డారు. రెండు రోజుల్లోనే నిందితులను అరెస్టు చేసి కారాగారానికి పంపించారు.

రంజీ ట్రోఫీ జట్టు సారథిగా మాయాంక్ అగర్వాల్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక-కేరళ జట్ల మధ్య ఈనెల 18 నుంచి రంజీ ట్రోఫి క్రికెట్ పోటీ ప్రారంభం కానుంది. ఈ పోటీలో పాల్గొనే కర్ణాటక జట్టుకు మాయాంక్ అగర్వాల్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినట్టు కర్ణాటక క్రికెట్ సంఘం గురువారం ప్రకటించింది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టు వివరాలు... నిఖిన్‌జోష్, దేవదత్‌పడికల్, ఆర్.సమ్రన్, మనీష్‌పాండే-వైస్‌కెప్టెన్, శ్రేయస్‌గోపాల్, సుజయ్‌సతేరి-వికెట్‌కీపర్, హర్ధిక్‌రాజ్, వి.కౌశిక్, లువ్నిత్‌సిసోడియా, మోషిన్‌ఖాన్, విద్యాధరపాటిల్, కిశన్, అభిలాష్‌శెట్టి పాల్గొంటున్నారు.



ఉత్తమ నర్సులకు పురస్కారాలు

బెంగళూరు (యశ్వంతపుర) : రోగులకు మేలైన సేవలు అందిస్తున్న ఉత్తమ నర్సులను ఎంపిక చేసి పురస్కారాలను ఈఏడాది డిసెంబరులో బెంగళూరు నగరంలో జరిగే కార్యక్రమంలో అందిస్తున్నట్లు గ్లోబల్ హెచ్ఐవీ ప్రివెన్షన్ సంస్థ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు ఆచార్య జేమ్స్ బుచాన్ తెలిపారు. గురువారం ఇక్కడ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్టర్ గార్డియన్స్ గ్లోబల్ నర్సింగ్ అవార్డులు-2024 కోసం 78 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారని, అందులో పది మందిని ఎంపిక చేసి రూ.2 కోట్లు నగదు పురస్కారాలను అందిస్తామని తెలిపారు. ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఆజాద్ మూపెన్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న నర్సులు అత్యుత్తమ ప్రతిభను చూపించారని, రోగులు, సమాజం కోసం తమ విధులకు మించి శ్రమిస్తున్నారని, వారి కోసం ఆస్టర్ గార్డియన్స్ గ్లోబల్ నర్సింగ్ అవార్డులను ఏటా అందిస్తున్నట్లు గుర్తు చేశారు.

పారా ఒలింపిక్స్ విజేత నితేష్‌కుమార్‌కు సత్కారం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : హెల్త్ ఛాంపియన్ పథకంలో భాగంగా పారా ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నితేష్‌కుమార్‌ను సత్కరించారు. హ్యాపీయస్ట్ హెల్త్ నిర్వహించిన కార్యక్రమంలో నితేష్‌కుమార్ హెల్త్ ఛాంపియన్ గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం సైక్లింగ్, నడకలో పాల్గొనాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హ్యాపీయస్ట్ హెల్త్ కో ఛైర్మన్ డేవిస్‌కరెండన్, సీఈవో అనింద్యాచౌదరి, ఆషీష్‌ప్రతాప్, రవిజోషి పాల్గొన్నారు.



జ్ఞాపిక అందుకుంటున్న నితేష్‌కుమార్

యువ వేద పండితునికి ఘన సత్కారం

శివమొగ్గ, న్యూస్‌టుడే : తొంభై రోజుల పాటు రోజుకు ఏడు గంటలు రుగ్వేద పారాయణ చేసిన యువ వేదపండితుడు చంద్రమౌళి మురళీకృష్ణన్‌ను శనివారం ఘనంగా సత్కరిస్తామని కుడలి శృంగేరి మహా సంస్థానం ప్రతినిధులు ప్రకటించారు. శివమొగ్గలో నిర్వహించే శోభాయాత్రలో మురళీకృష్ణన్‌ను ఊరేగింపుగా గాయత్రి మాంగల్య మందిరానికి తీసుకువస్తారు. అభినవ శంకర భారతి మహాస్వామి, హెబ్బలి చైతన్య ఆశ్రమ మఠాధిపతి దత్తావధూత మహారాజ్ సమక్షంలో ఆయనకు రూ.10 లక్షల నగదు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. శోభాయాత్ర కోటె రోడ్డు, గాయత్రి ఆలయం, సీఎల్ రామన్న రోడ్డు, పాత బారువీధి, బీహెచ్ రోడ్డు మార్గంలో కొనసాగుతుంది. రుగ్వేద సంహితలో మొత్తం 10552 రుక్కులు ఉండగా, ఉదయం నాలుగు గంటలు, సాయంత్రం మూడు గంటల పాటు మొత్తం 630 గంటల పాటు ఆయన ఘనా పఠనం చేశారు. శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్త, జ్యోతిష్యం, కల్పం, సంహిత, బ్రాహ్మణ్య, అరణ్యకం, ప్రాతిఖాఖ్య అనే గ్రంథాన్ని పారాయణం చేశారు. కఠినమైన పారాయణాన్ని ఒకే వ్యక్తి పుస్తకాలను చూడకుండా పఠించడం గొప్ప విషయం.

అమెజాన్ గ్రేట్‌ఇండియా సంబరాలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని అమెజాన్ గ్రేట్ ఇండియా ఫెస్టివల్స్-2024 కొనసాగుతోంది. ఫెస్టివల్స్ ప్రారంభమైన పది రోజుల్లో వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చిందని డైరెక్టర్ సుబిత్ సుభాస్ తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, చరవాణులతో పాటు చాకొలేట్, ఎండు ఫలాలు తదితర కొనుగోళ్లు ఎక్కువగా జరిగినట్లు తెలిపారు. పదిశాతం రాయితీ, బ్యాంక్ రుణాలతో వస్తువులు కొనుగోలుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

వీధి కుక్కలకు ఆహారం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : స్వచ్ఛంద సేవా సంస్థలు, సమాజంలో ఉన్న శునకం ప్రేమికుల నేతృత్వంలో వీధి కుక్కలకు ఆహారం అందించే శునకం మహోత్సవాన్ని గురువారం ఇక్కడ పాలికె ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కమిషనర్ సురళ్కర్ వికాస్ కిశోర్ ప్రారంభించారు. వీధి కుక్కలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను గుర్తించి అక్కడ వాటికి స్థానికుల సాయంతో ఆహారాన్ని అందిస్తామన్నారు. అందుకు అనేక సంస్థలు, వ్యక్తులు ముందుకొచ్చినట్లు తెలిపారు. వీధి కుక్కలు వాహనాల ప్రమాదాలకు గురి కాకుండా మెడకు రేడియం బెల్ట్ కడుతామన్నారు. వీధి కుక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు.



శునకానికి ఆహారం తినిపిస్తున్న పాలికె ప్రత్యేక కమిషనర సురళ్కర్‌వికాస్ కిశోర్ తదితరులు

దక్షిణభారత అబిలింపిక్స్ ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విక్టర్‌లోబా, గీతాంజలీ కిర్లోస్కర్ తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : దక్షిణ భారత ప్రాంతీయ అబిలింపిక్స్-2024 గురువారం ఇక్కడి సెయింట్ జోసెఫ్స్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. టొయోటా సీఇఒ గీతాంజలీ కిర్లోస్కర్, ఉప కులపతి విక్టర్‌లోబా ప్రారంభించారు. వైకల్యం ఉన్న వారిలో ప్రతిభ వెలికితీసేందుకు అబిలింపిక్స్ ప్రత్యేకత చాటుకుంది. వంద మంది పోటీదారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు జితేంద్రఅగర్‌వాల్, ఆనంద్‌నాయక్, టి.రాఘవేంద్ర, సంజయ్‌కుమార్‌దాస్ పాల్గొన్నారు.

తల్లీకుమార్తెపై దాడి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : పొలంలో పని చేసేందుకు వచ్చిన తల్లీకుమార్తెపై దాడి చేసిన ఆరోపణలపై యాసిన్ అనే నిందితుడిని సర్జాపుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. సర్జాపుర సమీపంలోని మట్టనహళ్లిలో తోటలో పుదీనా కోసేందుకు తల్లీ కుమార్తెలు వచ్చారు. అక్కడికి యాసిన్ పనికి వచ్చాడు. సాయంత్రం పని ముగిసిన తర్వాత నీ కుమార్తెను నాతో పంపిస్తే బైకులో ఇంటి వద్ద వదిలి పెడతానని యాసిన్ సూచించాడు. వారు నిరాకరించడంతో దాడి చేసి పరారయ్యాడు.

ఇంటి గోడ కూలి వృద్ధురాలి దుర్మరణం

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : తాలూకాలోని ఈచలనాగేనహళ్లి గ్రామంలో వర్షాలకు ఇంటి గోడ కూలి మట్టి పెళ్లల కింద చిక్కుకొని రంగమ్మ (63) అనే వృద్ధురాలు మృతి చెందింది. గోడలు కూలిన సమయంలో రంగమ్మ ఒక్కరే ఇంటిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్తులు శిథిలాలను తొలగించి రక్షించేలోగా ఆమె చనిపోయినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే వీరేంద్ర, తహసీల్దార్ నాగవేణిలు గ్రామానికి వెళ్లి రంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నష్టపరిహారం కింద రూ.5 లక్షలకు సంబంధించిన పత్రాలను అందజేసారు.



పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేంద్ర, తహసీల్దార్ నాగవేణి (అంతర చిత్రంలో) రంగమ్మ

మాన్యతా టెక్‌పార్క్ శుభ్రత

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వర్షాలకు ముంపునకు గురైన ప్రముఖ ఐటీ ప్రదేశం హెబ్బాళ్ మాన్యతా టెక్‌పార్క్‌ను అక్కడ పని చేస్తున్న సిబ్బంది శుభ్రం చేశారు. రహదారులపై నిలబడిన నీరు బయటకు పంపించారు. రహదారులు, పాదచారి మార్గం, భద్రత సిబ్బంది కార్యాలయాలు తదితర వాటిల్లో ఉన్న బురదను తొలగించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు సిబ్బంది నీటితో శుభ్రం చేశారు. అనంతరం వాహనాల రాకపోకలకు అనుమతించారు. మాన్యతా టెక్‌పార్క్ పక్కన పెద్ద రాజకాలువ ఉంది. భారీ వర్షం కురిస్తే కాలువ పొంగి టెక్‌పార్క్‌లోకి మురికినీరు వచ్చి చేరుతోంది. గత మూడేళ్లలో రెండు సార్లు ఆప్రదేశం మునిగిన విషయం తెల్సిందే. అక్కడ పని చేసే ఉద్యోగులు ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాల్లో సంచరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు రోజులు పాటు ముంపునకు గురైన తరువాత ఉద్యోగులు పని చేసేందుకు అనుమతించారు. అక్కడ నిర్మాణం కోసం తవ్విన గుంత నీటితో నిండింది. నీరు నిలబడటంతో ప్రహారీ కూలింది. అక్కడ ఉన్న రాజకాలువ సంరక్షణ గోడల ఎత్తు పెంచి పూడిక తొలగిస్తే ముంపు నుంచి బయటపడవచ్చునేనే అభిప్రాయం నిపుణులు వ్యక్తం చేశారు.



శుభ్రం చేసిన ప్రధాన రహదారులు

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

విశ్వవిద్యాలయానికి వాల్మీకి పేరు సబబే

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు విశ్వవిద్యాలయానికి మహర్షి వాల్మీకి పేరును నామకరణం చేస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించడంపై చిన్న నీటిపారుదల, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి బోసురాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వందశాతం సబబుగా ఉందని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లోని విశ్వవిద్యాలయాలకు మహనీయుల పేరు పెట్టినట్లే రాయచూరు విశ్వవిద్యాలయం విషయంలో సరైన ఆలోచన చేసిన సీఎంను అభినందిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అంతా స్వాగతించడం శుభ పరిణామమని వ్యాఖ్యానించారు.

కారాగారం నుంచే హనీట్రాప్‌కు ప్రణాళిక

కలబురగి, న్యూస్‌టుడే : కారాగారంలో ఖైదీలు గంజాయి, చరవాణి వినియోగిస్తున్న ఆరోపణలపై అధికారులు సోదా చేస్తూ ఉంటారు. బెంగళూరు మల్లేశ్వరంలో పేలుడు ఘటనలో నిందితుడు, అనుమానిత తీవ్రవాది జుల్ఫిక్, శివమొగ్గకు చెందిన రౌడీషీటర్ బచ్చన్ ఇద్దరూ కలబురగి కేంద్ర కారాగారంలో ఒకే బ్యారక్‌లో ఉండేవారు. వీరిద్దరూ కారాగారం నుంచే శ్రీమంతులకు ఫోన్లు చేసి మీ నగ్న చిత్రాలు ఉన్నాయని, కొందరు యువతులతో నగ్నంగా మారి ఫోను చేశారని బెదిరించి, తమ ఖాతాలకు నగదు వేయించుకునేవారు. కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న సాగర్ అనే ఖైదీని ఇలాగే బెదిరించారు. తమకు పరిచయం ఉన్న ఒక యువతితో సాగర్ నగ్నంగా మారి మాట్లాడేలా చేశారు. సాగర్ ఫిర్యాదుతో నిందితుల నుంచి సెల్‌ఫోన్ జప్తు చేసుకున్నారు. వారిద్దరినీ వేర్వేరు బ్యారక్‌లకు మార్చి విచారణ చేపట్టారు.

చిరస్మరణీయులు మహర్షి వాల్మీకి



చిత్రపటం ఊరేగింపులో ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి రచించిన రామాయణ గ్రంథంలోని బోధనలు, సందేశాలు సదా కాలాలకు అనుసరణీయమని రాయచూరు ఎంపీ కుమారనాయక్ పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం ఇక్కడి వాల్మీకి భవన్‌లో వాల్మీకి జయంతి ఘనంగా ఆచరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ రాముడి సత్యవాక్కు, ధర్మ పరిపాలన, అన్నదమ్ముల అనుబంధం, ఆప్యాయతల గురించి వివరించిన రామాయణాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనేక సమస్యలకు ఈ గ్రంథంలో పరిష్కారం చూపారని తెలిపారు. జయంతిని కేవలం ఒక రోజుకు మాత్రమే పరిమితం చేయవద్దని, మహర్షి చూపిన బాటలో నడవాలన్నారు. అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు వాల్మీకి రాసిన రామాయణం ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. యుగాలు గడిచినా ఈ గ్రంథానికి ఆదరణ తగ్గలేదన్నారు. రాయచూరులో వాల్మీకి భవన నిర్మాణం పూర్తి అయ్యేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. పది, పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన నాయక సామాజిక వర్గం విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలను ప్రదానం చేశారు. జిల్లా పాలనాధికారి నితీష్, జడ్పీ సీఈవో రాహుల్ తుకారం పాండ్యే, నగరసభ అధ్యక్షురాలు నరసమ్మ పాల్గొన్నారు.

★ జిల్లా పాలనాధికారి క్యాంపు కార్యాలయం దగ్గర వాల్మీకి విగ్రహానికి ఉదయం పూజలు చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సంఘాల, సంస్థల ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆకర్షణీయమైన కళా బృందాల ప్రదర్శన మధ్య చిత్రపటాన్ని పట్టణంలో ఘనంగా ఊరేగించారు.

వాల్మీకి జీవితం విద్యార్థులకు స్ఫూర్తి

రాయచూరు, న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి ఆలోచనలు, జీవితకథ నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని రాయచూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య హరీష్ రామస్వామి కోరారు. కృష్ణ తుంగా సభాప్రాంగణంలో గురువారం వాల్మీకి జయంతిని ఆచరించారు. వాల్మీకి చిత్రపటానికి ఉప కులపతి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి, బుద్ధుడు, బసవణ్ణ, తత్వ పదకారులు, దాసులు సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు కృషి చేశారని, మహనీయులను ఆ సామాజిక వర్గానికి పరిమితం చేయడం శోచనీయమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ అణగారిన వర్గంలో పుట్టిన వాల్మీకి రామాయణ మహా కావ్యాన్ని రాయడం ద్వారా ప్రతిభకు కులంతో సంబంధం లేదని నిరూపించారన్నారు. మూల్యాంకనం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.ఎర్రిస్వామి, అధ్యాపకులు వెంకటేష్, సుయిమీంద్ర కులకర్ణి, మల్లేశప్ప, అనిల్, విద్యార్థి సంక్షేమ అధికారి బిరాదార్, కళాశాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మహర్షికి నివాళులు



మాన్వి : వాల్మీకి విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్


వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..

వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో వాల్మీకి జయంతిని జరుపుకొన్నారు. పరిపాలనాధికారి డాక్టర్ జాగృతి తదితరులు చిత్రపటానికి పుష్పార్చన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బసవరాజ మాట్లాడుతూ మనిషి ఎలా జీవించాలో రామాయణంలో మహర్షి చక్కగా బోధించారని తెలిపారు. అధికారులు హనుమేశ్ నాయక్, మహదేవస్వామి, మచ్చేంద్రనాథ్ పాల్గొన్నారు.

మాన్వి : ఆది కవి, మహర్షిగా పేరుగాంచిన వాల్మీకి ఏ వర్గానికో, ఏ సముదాయానికో పరిమితం కాదని ఆయన అందరికీ ఆదిగురువు అని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. గురువారం తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంత్యుత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మనిషిలో పరివర్తనకు మరో పేరే వాల్మీకి అన్నారు. ఎంతటి కఠినాత్ముడైనా సాధన చేసి మహాపురుషులు కావచ్చనటానికి వాల్మీకి నిదర్శనమన్నారు. రాయచూరు విశ్వవిద్యాలయానికి వాల్మీకి పేరు పెడతామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించటం అభినందనీయమన్నారు. కరిడిగుడ్డ క్రాస్ వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించి జయంతి ఊరేగింపు ప్రారంభించారు. అక్కడి నుంచి సభా వేదిక ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయం వరకు కళాకారుల విన్యాసాలు, నృత్యాలతో ఊరేగింపు కొనసాగింది. పురపాలక సంఘం అధ్యక్షురాలు లక్ష్మి డి విరేశ్, మాజీ ఎమ్మెల్యేలు గంగాధర్‌నాయక్, రాజా వెంకటప్పనాయక్, తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడు గఫూర్, తాలూకా భాజపా అధ్యక్షుడు జె.సుధాకర్, ప్రముఖులు సి.గురునాథ్, అక్బర్‌పాషా, శివరాజ్‌నాయక్, అయ్యప్పమేకల్, బసవరాజ్, నరసింహనాయక్, తహసీల్దార్ రాజు ఫిరంగి, పట్టణ పంచాయతీ ముఖ్యాధికారి గంధార్, రాజా శుభాశ్చంద్రనాయక్, గోపాల్‌నాయక్, వివిధ సంఘ సంస్థల నిర్వాహకులు, పురపాలక సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను ఘనంగా సత్కరించారు.



మాన్వి : ఊరేగింపులో పాల్గొన్న నాయకులు, ప్రముఖులు



సింధనూరు : నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు



ఆకట్టుకున్న రాముడు, ఆంజనేయ తదితర వేషధారణలు

సింధనూరు : సింధనూరు పట్టణం టవర్ క్లాక్ సమీపంలోని వాల్మీకి కూడలిలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఘననివాళి అర్పించారు. మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప, ఎమ్మెల్యే తనయుడు రాజుగౌడ బాదర్లి, భాజపా నాయకుడు రాజేశ్ హిరేమఠ్ తహసీల్దారు అరుణ్‌దేశాయ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహర్షి వాల్మీకి జీవనం నేటి యువతకు ఆదర్శప్రాయం కావాలని కేవీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వివిధ రంగాల ప్రముఖులు, సంఘసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయచూరులో ఈనాడు

రాయచూరు, న్యూస్‌టుడే : కిత్తూరి రాణి చెన్నమ్మ జయంతి నిర్వహణపై శుక్రవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తారని కన్నడ, సంస్కృతి శాఖ సహాయక నిర్దేశకుడు దత్తప్ప తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా పాలనాధికారి సభాభవన్‌లో ప్రారంభమవుతుందని, జిల్లా అదనపు పాలనాధికారి శివానంద అధ్యక్షత వహిస్తారని వివరించారు. రాణి చెన్నమ్మ సామాజిక వర్గ ప్రముఖులు, అధికారులు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ నెల 23న జయంతిని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

సంతోషిమాత ఆలయానికి నూతన రథం



కొత్త రథానికి పూజ చేస్తున్న భక్తులు

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని సంతోషిమాత దేవస్థానానికి భక్తులు నూతన రథాన్ని సమకూర్చారు. అమ్మవారి 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉడుపి ఫలిమారుమఠం విద్యాధీశ పాదంగళ్ సాన్నిధ్యంలో రామదేవ సంస్థాన పూజ, హోమపూజ, పూర్ణాహుతి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంతోషిమాత ఆలయం చుట్టూ, పట్టణంలోని ప్రముఖ వీధుల్లో రథాన్ని ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘం తాలూకా అధ్యక్షుడు ఆర్.ముత్తురాజ్‌శెట్టి, దేవస్థాన సమితి అధ్యక్షుడు ద్యాసనూరు రాఘవేంద్రశెట్టి, కార్యదర్శి మన్సాలి వెంకయ్యశెట్టి, ఉపాధ్యక్షుడు ఆర్.శివశంకర్‌శెట్టి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కట్టడికి పకడ్బందీ చర్యలు: ఎస్పీ

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే : సంగారెడ్డి జిల్లాలో గంజాయి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ హెచ్చరించారు. జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి రవాణా, హస్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనూరు మండలం డొవ్వూరు కూడలి వద్ద టీఎస్-న్యాబ్ పోలీసులు, మనూరు ఎస్సై, సిబ్బంది వాహనాలు తనిఖీ చేయగా, కారు డిక్కీలో 40 కిలోల ఎండు గంజాయి లభించింది. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, బీదర్ జిల్లా బసవేశ్వర్ చౌక్‌కు చెందిన మల్లగొండగా తేలింది. అతను చోరీ కేసుల్లో బీదర్ జిల్లాలో జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో ఒడిశాకు చెందిన రాహుల్ చక్రవర్తి, బాల్కికి చెందిన మల్లేశ్ యాదవ్, మహారాష్ట్రకు చెందిన దాదాపాటిల్‌తో ఇరువురికి పరిచయం ఏర్పడింది. ఇరువురు జైలు నుంచి ఇటీవల బయటకు వచ్చారు. సెప్టెంబరులో జహీరాబాద్ సమీపంలోని చిరాగ్‌పల్లిలో 140 కిలోల ఎండు గంజాయి తరలించే క్రమంలో ఇరువురు తప్పించుకున్నట్లుగా మల్లగొండ నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించామన్నారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

గణిత మేధావి ఉగ్రాణి సందడి



కార్యక్రమంలో పాల్గొన్న బసవరాజ్ శంకర్ ఉగ్రాణి (కోటు ధరించిన వ్యక్తి)

సింధనూరు, న్యూస్‌టుడే : పుట్టుకతోనే అంధత్వం ఆవరించినా.. దేవుడిచ్చిన వరంగా గణితంలో పండిపోయి. .మానవ కంప్యూటర్‌గా కీర్తి గడించిన బెల్గాం జిల్లా అథణి యువకుడు బసవరాజ్ శంకర్ ఉగ్రాణి గురువారం స్థానిక ఈజే.హొసళ్లిక్యాంపులోని ఐక్యా విద్యాసంస్థలో కొద్దిసేపు సందడి చేశారు. ఎంతటి పెద్ద లెక్కనైనా సరే తీసివేత, కూడిక, గుణకారం, భాగహారం సెకన్లలో సమాధానం చెబుతూ.. విద్యార్థులను ఉర్రూతలూగించారు. గడియారం లేకుండా అప్పటికి సమయం ఎంతైందో చెప్పి ఆశ్చర్యపర్చారు. ఎవరి జన్మదినం తేదీ చెప్పినా..అది ఏ రోజు అనే వివరాలు క్షణాల్లో చెబుతూ అందరూ అవాక్కయ్యేలా చేశారు. చివర్లో ఉగ్రాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషి జీవితం భగవంతుడు ఇచ్చిన వరం. దీనిని చక్కగా మలుచుకుని పది మంది మెచ్చుకునేలా ఆదర్శ జీవనం సాగించాలని కోరారు. ఐక్యా విద్యా సంస్థ యాజమాన్యం కొరిపెళ్ల సుగుణ, రాఘవేంద్ర, ప్రాచార్యులు రాజశేఖర్, బసవరాజ్ పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

17-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.93	1613.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	28,487	652
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	28,607	10,466
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.500	44.645

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

రథయాత్రతో భావనాత్మక సంబంధాలు



వీడ్కోలు పలుకుతున్న ఎంపీ కుమారనాయక్ తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : అఖిల భారత కన్నడ సాహిత్య 87వ సమ్మేళనాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా సంచరిస్తున్న కన్నడ జ్యోతి రథయాత్ర బుధవారం రాత్రి రాయచూరుకు చేరుకుంది. గురువారం ఉదయం రంగ మందిరం నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా బసవేశ్వర కూడలి వరకు మంగళవాయిద్యాల మధ్య సాగిన యాత్రలో మహిళలు కలశాలతో ముందుకు నడిచారు. యాదగిరి జిల్లా వైపు వెళ్లే రథానికి ఎంపీ కుమారనాయక్ పూజలు చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాభిమానాన్ని, రాష్ట్ర భక్తిని పెంపొందిందుకు యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి చోట ఐక్యంగా ఘన స్వాగతం పలుకుతున్నందున కన్నడిగుల మధ్య భావనాత్మక సంబంధాలు మెరుగుపడుతున్నాయని చెప్పారు. మండ్యలో జరగబోయే సాహిత్య సమ్మేళనంలో కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రతి కన్నడిగుడు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అదనపు పాలనాధికారి శివానంద, రాయచూరు తహసీల్దార్ సురేష్ వర్మ, మున్సిపల్ కమిషనర్ గురుసిద్ధయ్య హీరేమఠ, జిల్లా విద్యాశాఖ ఉప నిర్దేశకుడు బడిగేరా, రాయచూరు తాలూకా పంచాయతీ ఈవో చంద్రశేఖర్ పవార్, కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయక నిర్దేశకుడు దత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌ప్రభు ఆలయంలో ఆరాధనోత్సవాలు



పాత్రికేయులకు వివరిస్తున్న బండూరావ్

రాయచూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని పురాతన మాణిక్‌ప్రభు దేవస్థానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ సమితి సభ్యుడు బండూరావ్ చాగి వెల్లడించారు. ఆయన గురువారం పత్రికాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొలి రోజు ప్రభు సంస్థానం పంచమ పీఠాధిపతి సిద్ధరాజ మాణిక్‌ప్రభు వర్ధంతి, రెండో రోజు ఆరాధనోత్సవం, చివరి రోజు ప్రభు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, శిఖరం స్థాపన జరుగుతుందని వివరించారు. ప్రస్తుత పీఠాధిపతి జ్ఞానరాజ నేతృత్వంలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తారని చెప్పారు. దేవాలయం ప్రతినిధి ప్రభు మాట్లాడుతూ 1900 సంవత్సరంలో మాణిక్‌ప్రభు దేవస్థానాన్ని నిర్మించారని వెల్లడించారు. ఆధ్యాత్మిక సేవలతో సహా అంధ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్నామని, వసతి సౌకర్యాలు కల్పించినట్లు విశదీకరించారు. సమావేశంలో అంధపిల్లల పాఠశాల ముఖ్య గురువు ఆర్.ఎం.యత్నళ్లి, శ్రీధర్ పాల్గొన్నారు.

మృత్యువులోనూ.. కలిసి సాగి‘పోయారు’

వేర్వేరు ప్రమాదాల్లో ‘దంపతుల’ మృతి

బెళగావి, న్యూస్‌టుడే: వారిది విడదీయరాని బంధం. అనూహ్యంగా మృతువు వెంటాడింది. వేర్వేరు చోట్ల చోటుచేసుకున్న రెండు ప్రమాదాల్లో రెండు జంటలు ఈలోకాన్ని వీడిపోయాయి. ఆ వివరాలో.. బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా నొగణిహాళ గ్రామ సమీపాన నదికి అడ్డంగా నిర్మించిన వంతెనపై బైకు అదుపుతప్పి ఘటప్రభ నదిలో పడడంతో దానిపై వెళుతున్న దంపతులు నీట మునిగి గురువారం మరణించారు. మృతులను సురేశ్ బడిగేర, జయశ్రీగా గుర్తించారు. భారీ వర్షాలకు వంతెనపై నీరు ఉండడం, వేగంగా వెళుతున్న సమయంలో టైర్లు జారి వారిద్దరూ నదిలో పడిపోయారు. జయశ్రీ మృతదేహాన్ని అగ్నిమాపకదళ సిబ్బంది వెలికి తీశారు. మరో మృతదేహం కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. హుక్కేరి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రియుడి మాయలో భర్తనే కడతేర్చింది..

ఫేస్‌బుక్ తెచ్చిన చేటు



పంచనామా చేస్తున్న పోలీసులు (ఎడమ), సంతోశ్ పద్మణ్ణవర (కుడి)

బెళగావి, న్యూస్‌టుడే : కుందానగరి బెళగావిలో సంచలనానికి కారణమైన ఓ హత్య కేసు కొత్త మలుపుతిరిగింది. ఆంజనేయనగర నివాసి, భూ వ్యాపారి సంతోశ్ పద్మణ్ణవర (47) ఈ నెల 9న గుండెపోటుతో మరణించారు. సదాశివనగర శ్మశానవాటికలో పదో తేదీ అంత్యక్రియలు ముగిశాయి. తన తండ్రి మరణం అనుమానాస్పదంగా ఉందని సంజనా మాళమారుతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో సీసీ కెమెరా ఫుటేజ్‌ను కొన్ని చోట్ల తొలగించినట్లు ఆమె గుర్తించారు. పోలీసు కమిషనర్ యడా మార్టిన్ మార్బన్యాంగ్ ఈ అంశంపై స్పందించి మృతదేహాన్ని బయటకు తీయించి, పంచనామా చేయించారు. సంజన ఫిర్యాదుతో సంతోశ్ భార్య ఉమా పద్మణ్ణవర, ఆమె స్నేహితుడు శోభిత్ గౌడ, వారింట్లో పని చేస్తున్న నందా కురియా, ప్రకాశ కురియా, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తానే ఈ హత్య చేయించానని సంతోశ్ భార్య ఉమ (42) అంగీకరించిందని పోలీసులు వెల్లడించారు. మంగళూరుకు చెందిన శోభిత్ గౌడ ఆమెకు ఫేస్‌బుక్‌లో పరిచయం అయ్యాడు. ఆ పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. అడ్డుగా ఉన్న భర్తను తప్పించేందుకు గొంతు నులిమి హత్య చేశారు. అతను గుండెపోటుతో మరణించాడని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశారు. తండ్రి మరణం అనంతరం ఇంట్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించగా, తనకు పరిచయం లేని వ్యక్తులు ఇంట్లోకి వచ్చి వెళ్లడాన్ని సంజన గుర్తించింది. తల్లి ప్రవర్తన అనుమానంగా అనిపించింది. విచారణలో సంజన భావించినట్లు తల్లే తన ప్రియునితో కలిసి హత్య చేయించిందని తేలిందని పోలీస్ అధికారులు వివరించారు.

పత్తికి మద్దతు ధర సాధనకు నేడు ఆందోళన

రాయచూరు, న్యూస్‌టుడే : పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవటానికి శుక్రవారం రాయచూరులో ఆందోళన చేపడుతున్నామని అఖిల భారత రైతు వ్యవసాయ కార్మికుల సంఘటన (ఏఐకేకేఎంఎస్) జిల్లా కార్యదర్శి మల్లనగౌడ అంచెసగూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ కూడలి వద్ద ర్యాలీ ప్రారంభించి, బసవేశ్వర కూడలి మీదుగా జిల్లా పాలనాధికారి కార్యాలయం చేరుకుంటుందని వివరించారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని పోరాటాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేపు వినియోగదారుల సమావేశం

రాయచూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారుల సమావేశాన్ని ఈ నెల 19న రాయచూరులోని జెస్కాం కార్య, పాలనా ఉప విభాగం-1 కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు జెస్కాం ఇంజినీర్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం జరుగుతుందని తెలిపారు. ప్రజలు హాజరై విద్యుత్తుకు సంబంధించిన సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి నెలా మూడో శనివారం సమావేశాన్ని జరుపుతున్నారు.

ఎమ్మెల్యే యత్నాళ్‌కు ‘న్యాయ’ తాఖీదులు

బెంగళూరు (మల్లేశ్వరం): ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావును, ఆయన భార్యను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌కు 42వ ఏసీఎంఎం న్యాయస్థానం జామీను రహిత వారెంటు జారీ చేసింది. ‘మంత్రి దినేశ్ గుండూరావు నివాసంలో సగం పాకిస్థాన్ ఉంది’ అని యత్నాళ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ దినేశ్ భార్య తబురావు పరువునష్టం కేసు దాఖలు చేశారు.